

నిత్యారాధనతో పరమేశ్వరుడి కటాక్షం

బ్రహ్మశ్రీ సామవేదం షణ్ముఖశర్మ



ఆధ్యాత్మిక ప్రవచనం చేస్తున్న సామవేదం షణ్ముఖ శర్మ



సంప్రదాయ నృత్యాలతో స్వాగతం

అనంతపురం కల్చరల్, జూలై 27: నిత్య ఆరాధనతో పరమేశ్వరుడి కటాక్షం ప్రాప్తిస్తుందని బ్రహ్మశ్రీ సామవేదం షణ్ముఖశర్మ అన్నారు. రామకృష్ణ సేవాసమితి 20వ వార్షికోత్సవాన్ని నగరంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో శనివారం నిర్వహించారు. కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఓం సంగీత నృత్య శిక్షణాలయం నాట్యాచార్యురాలు దేవరకొండ కౌసల్య బృందం కోలాటం, నృత్య ప్రదర్శనలతో సామవేదం షణ్ముఖ శర్మను 3వ రోడ్డు నుంచి ఫంక్షన్ హాల్ వరకు ఊరేగింపుగా తీసుకెళ్లారు. ఫంక్షన్ హాల్‌లో శ్రీ నృత్యకళానిలయం నాట్యాచార్యురాలు సంధ్యామూర్తి శిష్య బృందం శివపదం నృత్యరూపకాన్ని ప్రదర్శించింది. అనంతరం 'శివసాక్షాత్కారం' అంశంపై సామవేదం షణ్ముఖశర్మ భక్తులకు అనుగ్రహభాషణం చేశారు. ఓంకార, స్వాహాకార, స్వధాకార, వషట్కార, నమస్కారాలనే పంచప్రణవాలతో కూడిన, వాటికి లక్ష్యమైన మోక్షరూపబ్రహ్మమే శివపరమాత్మ అని ఆయన అన్నారు. ప్రతి ఒక్కరి హృదయంలో ప్రకాశించే ఆనంద స్వరూపుడే శివుడని అన్నారు. మనలో అన్నమయ, ప్రాణమయ, మనోమయ, విజ్ఞానమయ, ఆనందమయ అనే పంచకోశాలలో ప్రకాశించే చైతన్యరూపమైన పరమాత్మను మన శరీర క్షేత్రంలో ఉండే అంతర్యామిగా పరమేశ్వరుడిని దర్శించాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా న్యాయాధికారి శ్రీనివాస్, రామకృష్ణ సేవాసమితి అధ్యక్షుడు డాక్టర్ శ్రీకృష్ణశశి, కార్యదర్శి ప్రవీణ్, సహాయ కార్యదర్శి శ్రీధరమూర్తి, వేణుగోపాల్, సంధ్యామూర్తి, శ్రీవల్లి తదితరులు పాల్గొన్నారు.



ప్రవచనాలకు హాజరైన నగరవాసులు

సందడే సందడి..!



బీబీ ఫాతిమా బ్రహ్మోత్సవాల్లో భాగంగా నగరంలోని ఐదో రోడ్డులో శనివారం సాయంత్రం పెద్ద సరిగెత్తు వేడుకలను ఘనంగా నిర్వహించారు. బీబీ ఫాతిమా పీర్లను సాయంత్రం నుంచి రాత్రి వరకూ వేలాది మంది భక్తులు దర్శించుకుని, చక్కెర చదివించి మొక్కు తీర్చుకున్నారు. రోడ్డుకు ఇరువైపులా ఏర్పాటైన తినుబండారాలు, ఆటవస్తువుల దుకాణాలు కిటకిటలాడాయి. ఉత్సవ నిర్వాహకులు మల్లికార్జున, నరసింహులు, కేఎస్ మురళి, కిశోర్, మహేష్, చంద్రశేఖర్, అజ్జి, తిమ్మప్ప తదితరులు పర్యవేక్షించారు. పాతూరులో మొహర్రం వేడుకలను ఘనంగా నిర్వహించారు. పీర్ల ఊరేగింపుతో మార్కెట్ ప్రాంతంలో సందడి వాతావరణం నెలకొంది. యువత, చిన్నారులు గంధం చల్లుకుంటూ, డప్పు శబ్దాలకు అనుగుణంగా చిందులు తొక్కారు. **- అనంతపురం కల్చరల్**



పాతూరులో చిన్నారుల సంబరాలు



బీబీ ఫాతిమా దర్శనానికి పోటెత్తిన భక్తులు

ఎత్తిపోతలకు అనుకూలం..!

శ్రీశైలం జలాశయంలో నీరు పుష్కలం

ప్రభుత్వ అనుమతి రాగానే హంద్రీనీవాకు నీరు



హంద్రీనీవా కాలువ

గుంతకల్లు, జూలై 27: శ్రీశైలం జలాశయానికి భారీగా వరదనీరు చేరుతోంది. హంద్రీనీవా ఎత్తిపోతలకు అవసరమైన స్థాయికి నీటిమట్టం చేరింది. ఈ నెల రెండో వారం వరకూ వర్షాలు తక్కువగా ఉండటంతో డ్యాంలో నీటి నిల్వలు ఆలస్యంగా పెరిగాయి. గడిచిన పది రోజులుగా కర్ణాటకలో భారీ వర్షాలు కురుస్తుండటంతో డ్యాంలోకి వరద నీరు పెద్ద ఎత్తున చేరుతోంది. దీంతో హంద్రీనీవా ఎత్తిపోతలకు మార్గం సుగమమైంది. పంపింగ్ ప్రారంభం కావాలంటే డ్యాంలో కనీస నీటి మట్టం 835 అడుగులను దాటాల్సి ఉంటుంది. ప్రస్తుతం డ్యాంలో నీటి మట్టం 867.7 అడుగులకు చేరింది. వరద జలాలు మల్యాల పంపు స్టేషన్‌ను తాకాయి. ఏ నిమిషంలోనైనా నీటిని తోడేందుకు అనువైన పరిస్థితులు ఉన్నాయి. జల వనరుల శాఖాధికారులు ప్రభుత్వ అనుమతి కోసం ఎదురుచూస్తున్నారు.

భారీగా వరద..

శ్రీశైలం డ్యాం నీటి మట్టం శుక్రవారం మధ్యాహ్నానికి 867.7 అడుగులకు చేరింది. మల్యాల పంప్ స్టేషన్ వద్ద ఎత్తిపోతలు ప్రారంభం కావాలంటే డ్యాంలో నీటి మట్టం 835 అడుగుల కంటే ఎక్కువ ఉండాలి. గత నెలాఖరున 815 అడుగుల వరకు మాత్రమే నీరు ఉన్నింది. ఈ నెల మొదటి వారం ఔట్ ఫ్లో కంటే ఇన్‌ఫ్లో తక్కువగా ఉండటంతో డ్యాంలో నీరు 809 అడుగులకు తగ్గిపోయింది. దీంతో ఎత్తిపోతలకు ఆగస్టు నెల రెండో వారం వరకూ ఆగాల్సి వస్తుందేమోనని భావించారు. కానీ పది రోజుల నుంచి కృష్ణా నది ఎగువ ప్రాంతాలలో భారీ వర్షాలు కురుస్తున్నాయి. వరద మొదలు కావడంతో వారం కిందట డ్యాం నీటి మట్టం 835 అడుగులను దాటింది. ప్రస్తుతం 868 అడుగులను దాటి.. 126 టీఎంసీల నీరు శ్రీశైలం డ్యాంలోకి చేరింది. జలాశయంలోకి 2.68 లక్షల క్యూసెక్కుల నీరు చేరుతోంది. ఔట్ ఫ్లో 62.40 వేల క్యూసెక్కులుగా నమోదైంది.

వచ్చేవారం?

రాష్ట్రంలో కురుస్తున్న భారీ వర్షాలకు హంద్రీనీవా కాలువలోని కొన్ని పంప్ హౌస్‌ల వద్ద వరద నీటి తాకిడి ఏర్పడింది. వర్షపు నీటి సమస్య ఉన్న పంప్ హౌస్‌ల వద్ద ఒక పంపును ఆన్ చేసి నీటిని ఎగువకు ఎత్తిపోస్తున్నారు. హంద్రీనీవాలో పంపింగ్‌ను ప్రారంభించేందుకు 4 నుంచి 8 రోజుల సమయం పట్టవచ్చని భావిస్తున్నారు. డ్యాంలో నీటి చేరికను అంచనాకట్టి.. ప్రభుత్వం త్వరలో హంద్రీనీవాలో ఎత్తిపోతలకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చే అవకాశాలు ఉన్నాయి. ప్రభుత్వ అనుమతి వచ్చిన వెంటనే హంద్రీనీవా అధికారులు పంపింగ్‌ను చేపట్టడానికి సిద్ధంగా ఉన్నారు. గత సంవత్సరం ఆగస్టు 16వ తేదీన ఎత్తిపోతలు ప్రారంభంకాగా, 2022లో జూలై 13వ తేదీన, 2021లో జూలై 26వ తేదీన హంద్రీనీవాలో ఎత్తిపోతలు చేపట్టారు.

ప్రభుత్వం దృష్టికి ఆధునికీకరణ సమస్య

1.40 లక్షల ఎకరాలకు హెచ్చెల్సీ నీరు : కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్



కలెక్టర్‌తో మాట్లాడుతున్న అధికారులు

కణేకల్లు, జూలై 27: హెచ్చెల్సీ ఆధునికీకరణ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళతానని కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ అన్నారు. హెచ్చెల్సీపై శనివారం ఆయన పర్యటించారు. శ్రీచిక్కణ్ణేశ్వర వడయార్ చెరువు వద్ద అధికారులతో మాట్లాడారు. హెచ్చెల్సీ అధికారులు ఇప్పటికే ఆధునికీకరణ విషయాన్ని తన దృష్టికి తెచ్చారని, ఆగస్టు 1న విజయవాడలో జరిగే సమావేశంలో ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళతానని అన్నారు. ఈ ఏడాది టీబీ డ్యాంకు భారీగా నీరు చేరుతోందని, జిల్లా వ్యాప్తంగా 1.20 లక్షల ఎకరాల ఆయకట్టుకు నీరు అందించేందుకు చర్యలు తీసుకుంటామని అన్నారు. వీలైతే కర్నూలు జిల్లాలోని 20 వేల ఆయకట్టుకు కూడా సాగునీటిని అందిస్తామని అన్నారు. అత్యవసర పనుల కింద హెచ్చెల్సీ అధికారులు రూ.40 లక్షల ప్రతిపాదనలను తన దృష్టికి తెచ్చారని, వాటికి నిధులు మంజూరు చేసి పనులు చేయించామని అన్నారు. ఆగస్టు రెండో వారంలో ఐఏబీ సమావేశాన్ని ప్రజాప్రతినిధుల సమక్షంలో నిర్వహించి, నీటి వాటాలను కేటాయిస్తామని తెలిపారు. టీబీ డ్యాంలో ఉన్న ప్రస్తుత నీటి నిల్వల ఆధారంగా జిల్లాకు 26 టీఎంసీలను కేటాయించారని తెలిపారు. ఈ ఏడాది రైతులకు పంటలు పండించుకునేందుకు ఎలాంటి ఇబ్బంది ఉండకపోవచ్చని, తాగునీటి పథకాలకు కూడా సమృద్ధిగా నీరు అందవచ్చని ఆశాభావం వ్యక్తం చేశారు. పర్యటనలో హెచ్చెల్సీ ఎస్ఈ రాజశేఖర్, ఈఈ వెంకటరమణరెడ్డి, డీఈ మద్దిలేటి తదితరులు పాల్గొన్నారు. కాగా, చిక్కణ్ణేశ్వర చెరువుకు అనుసంధానంగా ఉన్న కల్వర్టు కూలడంతో తామే ఖర్చు పెట్టుకుని పనులు చేయించామని టీడీపీ నాయకులు కలెక్టర్‌కు తెలిపారు. హెచ్చెల్సీపై పలు చోట్ల ఇబ్బందికర పరిస్థితులు ఉన్నాయని, వాటికి నిధులు మంజూరు చేయాలని కోరారు. కణేకల్లు - మాల్యం గ్రామాల వేదవతి హగరిపై వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయని, రహదారికి నిధులు మంజూరు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ కన్వీనర్ లాలెప్ప, బీటీ రమేష్, చాంద్‌బాషా, వెంకటేశులు తదితరులు పాల్గొన్నారు.

సజావుగా ఇసుక పంపిణీ

కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్

రాయదుర్గం రూరల్, జూలై 27: జిల్లాలో ఇసుక పంపిణీ సక్రమంగా సాగుతోందని కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ అన్నారు. జుంజురంపల్లి వద్ద ఉన్న ఇసుక స్టాక్‌పాయింట్‌ను శనివారం ఆయన తనిఖీ చేశారు. జిల్లాలో ఉన్న ఒకే ఒక స్టాక్ పాయింట్ ఇదేనని, ఇక్కడ దాదాపు 56 వేల మెట్రిక్ టన్నుల ఇసుక నిల్వచేసే అవకాశం ఉందని అన్నారు. ప్రస్తుతం 40 వేల మెట్రిక్ టన్నుల ఇసుక నిల్వ ఉందని అన్నారు. ఉచిత ఇసుక కార్యక్రమం కింద ఇసుకను రీచ్ నుంచి డిపో వరకు తీసుకురావడం, లోడింగ్ చార్జీలు, రాయల్టీ చార్జీలు కలిపి మెట్రిక్ టన్ను ఇసుకను రూ.185కు అందిస్తున్నామని అన్నారు. ఇసుక పంపిణీ రాష్ట్రానికే పరిమితమని, అంతర్రాష్ట్ర సరఫరా అందుబాటులో లేదని అన్నారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో ఇసుకను పంపిణీ చేస్తున్నారని, సమస్యలు ఉంటే జిల్లా మైన్స్ అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. జిల్లాలో ఇళ్ల నిర్మాణానికి ఇసుకను ఉపయోగిస్తున్నారని, ఇక్కడి నుంచి కర్నూలు జిల్లా పత్తికొండ, శ్రీసత్యసాయి జిల్లా అమరాపురం వారు ఇసుకను తీసుకెళుతున్నారని తెలిపారు. జిల్లాలో కొత్త స్టాక్ యార్డులకు ప్రతిపాదనలు పంపిస్తామని తెలిపారు. ఇసుక స్టాక్ రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో మైన్స్ డీడీ నాగయ్య, సీఐ శ్రీనివాసులు, తహసీల్దార్ చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్

కార్తికేయా.. వెరీగుడ్..!



చిన్నారిని అభినందిస్తున్న కలెక్టర్

అనంతపురం టౌన్: నాలుగున్నర నెలల వయసులో వందలాది ఫ్లాష్ కార్డులలో బొమ్మలను గుర్తిస్తున్న చిన్నారి కార్తికేయను కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ అభినందించారు. ఇంత చిన్న వయసులో నోబెల్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్సులో చోటు దక్కించుకోవడం గొప్ప విషయమని అన్నారు. గుమ్మఘట్ట మండలం గోనబావి గ్రామానికి చెందిన సచివాలయ ఉద్యోగి శాంతి, హేమంత్ కుమార్ దంపతుల కుమారుడు కార్తికేయ. ఫ్లాష్ కార్డులపై ఉన్న కూరగాయలు, జంతువులు, పక్షులు, ఫలాలు, వాహనాలు, స్వాతంత్ర సమరయోధులను కార్తీక్ గుర్తించగలుగుతున్నాడు. దాదాపు 244 ఫ్లాష్ కార్డులను గుర్తిస్తుంటడంతో కార్తికేయ పేరు నోబెల్ బుక్ ఆఫ్ రికార్డ్సులో నమోదైంది. తమ కుమారుడితో దంపతులు శనివారం కలెక్టరేట్‌కు వచ్చారు. కలెక్టర్ సమక్షంలో ఫ్లాష్ కార్డులను చూపించగా.. చిన్నారి గుర్తించడంతో కలెక్టర్ ఆశ్చర్యపోయారు. చిన్నారికి మెడల్ అందజేసి అభినందించారు. చిన్నారిని సాధారణ బాలుడి తరహాలోనే పెంచాలని, భవిష్యత్తులో బాగా ప్రోత్సహించాలని తల్లిదండ్రులకు కలెక్టర్ సూచించారు.

ఫ్రెషర్స్‌డే హుషారు

విద్యార్థుల డ్యాన్సులు, కేకలు, కేరింతలతో కాలేజీ మార్మోగింది. నగరంలోని కేఎస్ఆర్ బాలికల జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ నాగరత్నమ్మ, అధ్యాపకుల ఆధ్వర్యంలో శనివారం ఫ్రెషర్స్ డేని ఘనంగా నిర్వహించారు. కోటి ఆశలతో కళాశాలలోకి అడుగుపెట్టిన అమ్మాయిలకు సీనియర్లు ఘనంగా స్వాగతం పలికారు. బాగా చదువుకుని భవిష్యత్తుకు చక్కని బాట వేసుకోవాలని ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ సూచించారు. ఈ రెండేళ్లు అత్యంత కీలకమని, సమయాన్ని వృథా చేసుకోకుండా చదువుకోవాలని సూచించారు. తల్లిదండ్రులు, అధ్యాపకులు గర్వపడేలా రాష్ట్రస్థాయి ఫలితాలు సాధించి, జూనియర్లలో స్ఫూర్తిని నింపాలని ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు సూచించారు. అనంతరం విద్యార్థినులు ప్రభాస్, అల్లు అర్జున్, జూనియర్ ఎన్టీఆర్, చిరంజీవి నటించిన సినిమాల్లోని పాటలకు స్టెప్పులు వేస్తూ సందడి చేశారు.

- అనంతపురం విద్య



నృత్యాలతో స్వాగతం.. సంబరం



వేడుకలో పాల్గొన్న ఇంటర్ విద్యార్థినులు

తహసీల్దార్లు రిలీవ్




కలెక్టరేట్ ఏఓ అంజనబాబును సత్కరిస్తున్న డీఆర్ఓ రామక్రిష్ణారెడ్డి తదితరులు

అనంతపురం టౌన్, జూలై 27: ఎన్నికలకు ముందు జిల్లాకు వచ్చిన తహసీల్దారు శనివారం రిలీవ్ అయ్యారు. వీరందరినీ రిలీవ్ చేస్తూ శుక్రవారం రాత్రి ఉత్తర్వులు ఇచ్చారు. దీంతో 31 మండలాల తహసీల్దార్లు, కలెక్టరేట్, ఆర్డీఓ కార్యాలయాలలో పనిచేస్తున్న ఏఓలు, డీఏఓలు మొత్తం 39 మంది డీటీలకు శనివారం ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించి, సొంత జిల్లాలకు వెళ్లిపోయారు. కలెక్టరేట్‌లో ఏఓ అంజనబాబును డీఆర్ఓ రామక్రిష్ణారెడ్డి, ఇతర అధికారులు, సిబ్బంది సత్కరించి వీడ్కోలు పలికారు. ఆర్డీఓ కార్యాలయంలో పనిచేస్తున్న డీఏఓలు రిలీవ్ అయ్యారు. జిల్లాకు చెందిన తహసీల్దారులు ఆదివారం కలెక్టరేట్‌లో రిపోర్ట్ చేసుకునే అవకాశం ఉంది.

ఉపాధిని వ్యవసాయానికి అనుసంధానం చేయాలి

రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత

అనంతపురం అర్బన్, జూలై 27: ఉపాధి హామీ పథకాన్ని వ్యవసాయానికి అనుసంధానం చేయాలని మాజీ మంత్రి, రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత అన్నారు. నగరంలోని తన నివాసంలో శనివారం ఆమె విలేకరులతో మాట్లాడారు. పెట్టుబడులను తగ్గిస్తేనే వ్యవసాయ మనుగడ సాధ్యమవుతుందని అన్నారు. కరువు జిల్లాలో రైతులను ఆదుకునేందుకు ఉపాధి హామీ పథకం ద్వారా పండ్లతోటల పెంపకాన్ని చేపట్టిన విషయాన్ని గుర్తు చేశారు. ప్రస్తుతం ఐదు ఎకరాల్లోపు రైతులకు మాత్రమే ఈ పథకాన్ని వర్తింపజేస్తున్నారని అన్నారు. జిల్లాలో ఎక్కువ శాతం రైతులు ఐదు ఎకరాల నుంచి పదెకరాల పొలం ఉన్నవారేనని, దీన్ని దృష్టిలో ఉంచుకొని పది ఎకరాల్లోపు రైతులకు అవకాశం కల్పించాలని కోరారు. జిల్లాలోని రైతులను ఉద్యాన పంటల సాగు దిశగా నడిపించాల్సిన ఆవశ్యకత ఉందని అన్నారు. ఉపాధి పథకాన్ని వ్యవసాయానికి అనుసంధానం చేసే అంశాన్ని సీఎం చంద్రబాబు, వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు దృష్టికి తీసుకువెళతానని ఆమె తెలిపారు.



మీడియాతో మాట్లాడుతున్న పరిటాల సునీత

బాలికలను వేధించిన వ్యక్తి అరెస్టు

గార్లదిన్నె, జూలై 27: హాస్టల్ బాలికలను లైంగికంగా వేధించిన మౌలా నూర్‌బాషాను పోలీసులు శనివారం అరెస్ట్ చేశారు. మండల కేంద్రంలోని రైల్వే గేటు సమీపంలో మిస్సోగ్రేస్ హోప్ పేరుతో పాస్టర్ మౌలా సయ్యద్‌వలి అనుమతులు లేకుండా బాలికల హాస్టల్ నిర్వహిస్తున్నాడు. ఆయన కుమారుడు మౌలా నూర్‌బాషా హాస్టల్‌లో ఉన్న బాలికలను లైంగికంగా వేధించాడు. ఈ విషయాన్ని బాలికలు తమ తల్లిదండ్రులకు చెప్పడంతో వారు హాస్టల్ వద్దకు చేరుకుని నిర్వాహకుడి కుటుంబ సభ్యులకు దేహశుద్ధి చేశారు. అనంతరం పోలీసులకు ఫిర్యాదు చేశారు. నిందితుడిపై పోలీసులు ఎస్సీ, ఎస్టీ, పోక్సో కేసు నమోదు చేశారు. విద్యార్థినులకు వేరే హాస్టల్‌లో చేర్పించేందుకు చర్యలు తీసుకుంటామని డీఎస్పీ వెంకటశివారెడ్డి తెలిపారు.

నరసక్క కడుపులో ఐదు కిలోల కణితి

విజయవంతంగా తొలగించిన పెద్దాస్పత్రి వైద్యులు

అనంతపురం టౌన్, జూలై 27: కడుపు నొప్పితో బాధపడుతూ.. సర్వజన వైద్యశాలలో చేరిన వృద్ధురాలికి వైద్యులు అరుదైన ఆపరేషన్ చేశారు. ఆమె కడుపులో ఉన్న ఐదు కేజీల కణితిని తొలగించారు. ఆమె కోలుకోవడంతో జనరల్ సర్జరీ విభాగాధిపతి డాక్టర్ రామస్వామినాయక్ వివరాలను వెల్లడించారు. రాయదుర్గం మండలం గోనబావి గ్రామానికి చెందిన నరసక్క(68) కొంతకాలం నుంచి కడుపునొప్పితో బాధపడుతోంది. వైద్యులను సంప్రదించి.. మందులు వాడినా తగ్గలేదు. కడుపులో గడ్డ ఉందని తెలుసుకునేలోగా అది భారీగా పెరిగిపోయింది. దీంతో ఆపరేషన్ చేసేందుకు ప్రైవేటు వైద్యశాలల డాక్టర్లు సంశయించారు. కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రి వైద్యులు కూడా ఆమె వయసు చూసి ఆపరేషన్ చేయడానికి నిరాకరించారు. కడుపు నొప్పి తీవ్రతరం కావడంతో జూన్ 28న ఆమెను కుటుంబ సభ్యులు అనంతపురం సర్వజన వైద్యశాలలో చేర్పించారు. పరీక్షించిన వైద్యులు.. ఆపరేషన్ చేస్తే ప్రాణాపాయం ఉంటుందని, ఒప్పుకుంటే ఆపరేషన్ చేస్తామని కుటుంబ సభ్యులకు తెలిపారు. వారు అంగీకరించడంతో పది రోజులపాటు వివిధ రకాల పరీక్షలు చేశారు. అనంతరం ఈ నెల 9న డాక్టర్ రామస్వామినాయక్, డాక్టర్ ఉజ్జినేశ్వరి, డాక్టర్ రమణనాయక్, అనస్థీషియా వైద్యులు హరికృష్ణ బృందంగా ఏర్పడి ఆపరేషన్ నిర్వహించారు. కడుపులో ఉన్న ఐదు కిలోల గడ్డను తొలగించారు. ఆ తర్వాత బాధితురాలికి 16 బాటిళ్ల రక్తం ఎక్కించారు. అవసరమైన వైద్య చికిత్సలు అందిస్తూ వచ్చారు. నరసక్క కోలుకోవడంతో శనివారం డిశ్చార్జ్ చేసి ఇంటికి పంపించారు. అరుదైన ఆపరేషన్ చేసి వృద్ధురాలి ప్రాణాలు నిలిపిన వైద్య బృందాన్ని సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వరరావు, ఆర్ఎంఓలు డాక్టర్ పద్మజ, డాక్టర్ హేమలత, డాక్టర్ శివకుమార్ అభినందించారు. పీజీలు డాక్టర్ అభిలాష్, డాక్టర్ విశాల్, డాక్టర్ రమ్య, స్టాఫ్ నర్సు సునీత తదితరులు పాల్గొన్నారు.



ఆపరేషన్ తర్వాత కోలుకున్న నరసక్కతో హెచ్ఓడీ డాక్టర్ రామస్వామినాయక్, ఇతర డాక్టర్లు

భలే మంచి రోజు..



పదో తరగతి దాటితే.. ఎవరి దావ వారిదే..! మళ్లీ కలుసుకునేందుకు ఎన్నేళ్లు పడుతుందో తెలియదు. వెతికి పట్టుకునేందుకు ఇప్పటిలాగా సెల్‌ఫోన్‌లు, సామాజిక మాధ్యమాలు లేవు. అలాంటిది ఏకంగా 56 ఏళ్ల క్రితం పదో తరగతి చదివినవారు కలుసుకోవడం అంటే మాటలా..? యల్లనూరు మండలం తిమ్మంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1968-69 బ్యాచ్ పదో తరగతి విద్యార్థుల సమ్మేళనం శనివారం జరిగింది. వీరిలో వివిధ ఉద్యోగాలు చేసి రిటైరైన వారు ఉన్నారు. వ్యవసాయం, ఇతర వృత్తులు చేస్తూ.. స్వస్థలాలో స్థిరపడినవారు ఉన్నారు. వృద్ధాప్యంలో ఉన్న వీరందరూ బడిలో చదివిన రోజులను గుర్తు చేసుకుని.. మళ్లీ అక్కడే కలిశారు. జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. ఆ పాఠశాలలో ఇప్పుడు పనిచేస్తున్న ఉపాధ్యాయులను సన్మానించారు. **- యల్లనూరు**



విన్నవించాలని..

ఏకమైన సచివాలయ ఉద్యోగులు

నియామక విధానంపై ఆందోళన

సమస్యల పరిష్కారం కోసం వేడుకోలు

కొత్త ప్రభుత్వ చల్లని చూపుకోసం రాష్ట్ర సదస్సు

అనంతపురం క్లాక్‌టవర్, జూలై 27: గ్రామ-వార్డు సచివాలయ ఉద్యోగులు ఉద్యోగ భద్రత కోరుతున్నారు. సచివాలయ ఉద్యోగుల వ్యవస్థకు విధి విధానాలు సూచించకుండా, సర్వీస్ నిబంధనలు అమలు చేయకుండా, జాబ్‌చార్ట్ లేకుండా, ప్రమోషన్లు లేకుండా పనిచేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఉద్యోగులు వాపోతున్నారు. అత్యున్నత విద్యనభ్యసించి, రూ.లక్షల్లో జీతాలు వదులుకుని ప్రభుత్వ ఉద్యోగమన్న ఆశతో వచ్చిన అనేకమంది గత ప్రభుత్వ వైఖరితో గందరగోళంలో పడిపోయారు. రాష్ట్ర వ్యాప్తంగా 1.27 లక్షల మంది గ్రామ-వార్డు సచివాలయ ఉద్యోగులు ఉండగా, ఉమ్మడి జిల్లాలో సుమారు 10వేల మంది వరకు పనిచేస్తున్నారు. గత ప్రభుత్వంలో అనేక అవమానాలు, భౌతికదాడుల కు సైతం ఎదురొడ్డి నిలబడ్డారు. కొత్త ప్రభుత్వానికి తమ సమస్యలు విన్నవించి పరిష్కరించుకుంటామనే ఆత్మవిశ్వాసంతో సచివాలయ ఉద్యోగులు ఏకమయ్యారు. అందుకు వేదికగా అనంతపురంను చేసుకున్నారు. ఈక్రమంలోనే జిల్లా కేంద్రంలో ఆదివారం నిర్వహించతలపెట్టిన గ్రామ-వార్డు సచివాలయ ఉద్యోగుల సదస్సును ఉపయోగించుకోనున్నారు. తాము భజనతో కాదు బాధ్యతతో, పార్టీలతో కాదు ప్రభుత్వంతో కలిసి పనిచేస్తామనే నినాదంతో ముందుకెళ్తున్నట్లు ఉద్యోగులు పేర్కొన్నారు.

నేడు గ్రామ-వార్డు సచివాలయ ఉద్యోగుల రాష్ట్ర సదస్సు

ఏపీ గ్రామ-వార్డు సచివాలయ ప్రభుత్వ ఉద్యోగుల రాష్ట్రస్థాయి సదస్సు ఆదివారం జిల్లా కేంద్రంలోని పాతూరులోని పద్మావతి ఫంక్షన్‌హాల్ (రమణ రమేష్ థియేటర్)లో నిర్వహించనున్నట్లు ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి వీకే లక్ష్మీనారాయణ తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 26జిల్లాల నుంచి సుమారు 4వేల మంది సచివాలయ ఉద్యోగులు హాజరయ్యే సదస్సుకు ముఖ్య అతిథులుగా ఏపీ గవర్నమెంట్ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు, ఐక్యవేదిక ఛైర్మన్ సూర్యనారాయణ, గ్రామవార్డు సచివాలయ ఉద్యోగుల రాష్ట్ర అధ్యక్షుడు అబ్దుల్ రజాక్‌లతో పాటు రాష్ట్ర మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు హాజరవుతారని తెలిపారు.

నియామకమే సక్రమంగా లేదు



గత ప్రభుత్వంలో ఉన్నత విద్యావంతులు సైతం పోటీ పరీక్ష ద్వారా గ్రామ-వార్డు సచివాలయ ఉద్యోగులుగా నియామకం పొందాం. అయితే సచివాలయ ఉద్యోగుల వ్యవస్థకు ఎటువంటి విధివిధానాలు సూచించకుండా, సర్వీస్ నిబంధనలు అమలు చేయకుండా, పదోన్నతులు లేకుండా ఎదుగూబొదుగూ లేకుండా ఉండిపోవాల్సిన పరిస్థితి. ఏపీపీఎస్సీ ద్వారా నియామకం చేపట్టకుండా, సుదీర్ఘ ఆలోచన లేకుండా తాత్కాలిక ఆలోచనతో గత ప్రభుత్వం మమ్మల్ని బలిచేసింది. సచివాలయాల్లో పనిచేస్తున్న 11వివిధ శాఖల ఉద్యోగుల సమస్యలపై ఉన్నత స్థాయి అధికారులతో 90రోజుల వ్యవధితో కమిటీ వేసి, పరిష్కరించాలి.

వీకే.లక్ష్మీనారాయణ, గ్రామ-వార్డు సచివాలయ ఉద్యోగుల సంఘం రాష్ట్ర కార్యదర్శి.

గుర్తింపు లేదు



ఉద్యోగంలో ఉన్నా మాకు ప్రజల్లో గుర్తింపు లేదు. మాకు ఉద్యోగం చేస్తున్నామన్న ఆత్మసంతృప్తి లేదు. ప్రత్యేక విధి విధానాలు వర్తింప చేయాలి. అప్పుడే ఉద్యోగానికి సార్థకత లభిస్తుంది. సచివాలయ ఉద్యోగులకు ఇన్‌చార్జిలుగా ఉన్న వారికి ఎఫ్ఏసీ ఇచ్చి అదనపు వేతనం చెల్లించాలి. బీఎల్‌ఓలుగా పనిచేసిన సచివాలయ ఉద్యోగులకు అందాల్సిన గౌరవ వేతనం బకాయిలు ఇవ్వాలి. సచివాలయ ఉద్యోగులను ఆయా మాతృశాఖలలో విలీనం చేయాలి. ఇందుకు ప్రభుత్వం వెంటనే చర్యలు ప్రారంభించాలి.

- శివశంకర్, సచివాలయ ఉద్యోగుల సంఘం జిల్లా అసోసియేట్ ప్రెసిడెంట్

ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి



ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించినప్పుడే మాకు న్యాయం జరుగుతుంది. ప్రజలతో మమేకమై శ్రమిస్తున్న మా వాయిస్ ప్రభుత్వానికి వినిపించాలి. జాబ్‌చార్ట్ లేకుండా, పదోన్నతులు లేకుండా మానసికంగా కుంగిపోతున్నాం. మొదట గ్రామ-వార్డు సచివాలయ ఉద్యోగులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి, ఉద్యోగభద్రత కల్పించాలి.

- సాకే రామాంజనేయులు, మౌలిక వసతులు కల్పన కార్యదర్శి.

మేస్త్రీల కింద పని చేయాల్సిన స్థితి



ఉన్నత విద్యనభ్యసించినా మున్సిపాలిటీలలో మేస్త్రీల కింద పనిచేయాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. మున్సిపాలిటీలలో, పంచాయతీలలో మాతో అన్ని పనులు చేయిస్తున్నారు. అయితే ప్రాధాన్యమైన జనన, మరణ, వివాహ సర్టిఫికెట్ల జారీ మాత్రం మాకు ఇవ్వకుండా కించపరిచారు. ప్రభుత్వ ఉద్యోగులకు వర్తిస్తున్న రూల్స్ అన్నీ కూడా సచివాలయ ఉద్యోగులకు వర్తించేలా చూడాలి. ప్రతి సారి కిందిస్థాయి అధికారులు సచివాలయ ఉద్యోగులను ప్రత్యేక జీఓలు, సర్క్యులర్లు అడగకుండా కంట్రోల్ చేయాలి.

- హనుమంతు, సచివాలయ ఉద్యోగి.

మొత్తం గేట్లు ఎత్తేశారు

తుంగభద్రకు కొనసాగుతున్న వరద



బయటకు వెళ్తున్న వరద జలాలు

బొమ్మనహాళ్, జూలై 27: తుంగభద్ర జలాశయానికి వరద పోటెత్తడంతో మొత్తం 33 క్రస్ట్ గేట్ల (25 గేట్లు మూడున్నర అడుగులు, మరో 8 గేట్లు ఒక్క అడుగు మేర)ను ఎత్తి నీటిని దిగువకు వదిలారు. 1,41,485 క్యూసెక్కుల నీటిని తుంగభద్ర నదికి, 8,895 క్యూసెక్కులను కాలువలకు విడుదల చేశారు. డ్యాం ఎగువ ప్రాంతాల్లో భారీ వర్షాలు కొనసాగుతుండటంతో ఆ వరదనీరు డ్యాంలోకి వచ్చి చేరుతోంది. ప్రస్తుతం డ్యాంకు ఇన్‌ఫ్లో 1,10,943 క్యూసెక్కులుండగా ఔట్ ఫ్లో కాలువలకు వదిలే నీటితో కలిపి 1,50,500 క్యూసెక్కులు ఉంది. డ్యాం కెపాసిటీ 1633 అడుగులతో 100.054 టీఎంసీల నీటిని నిల్వ ఉంచి మిగిలిన నీటిని బోర్డు అధికారులు దిగువకు వదులుతున్నారు. హెచ్చెల్సీ ఆంధ్రా సరిహద్దు 105వ కి.మీ. వద్ద 753 క్యూసెక్కుల నీటి ప్రవాహం కొనసాగుతోంది.

ఉజ్వల భవితకు పునాదులు వేసుకోండి

- ఏపీఎస్‌సీహెచ్ఈ మాజీ ఛైర్మన్ హేమచంద్రారెడ్డి



మాట్లాడుతున్న హేమచంద్రారెడ్డి

బుక్కరాయసముద్రం, జూలై 27: కళాశాలలో గడిపే నాలుగు సంవత్సరాలు ప్రతి విషయం చక్కగా నేర్చుకుని ఉజ్వల భవిష్యత్తుకు పునాది వేసుకోవాల్సిన బాధ్యత విద్యార్థులదేనని ఏపీఎస్‌సీహెచ్ఈ మాజీ ఛైర్మన్ హేమచంద్రారెడ్డి అన్నారు. 2024-25 సంవత్సరానికి సంబంధించి ఎస్ఆర్ఐటీలో చేరిన విద్యార్థులు, తల్లిదండ్రులతో కలిసి ఆరంభ్-2024 కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రొఫెసర్ హేమచంద్రారెడ్డి హాజరై మాట్లాడారు. ప్రతి ఇంజనీరింగ్ విద్యార్థి యాజమాన్యం, సిబ్బంది అందించే అన్ని అవకాశాలను చక్కగా ఉపయోగించుకోవాలన్నారు. బలాలు, బలహీనతలు అధిగమించి, సమస్యలను ఎదుర్కొని ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో కళాశాల కరెస్పాండెంట్ సాంబశివారెడ్డి, ఎస్ఆర్ఐటీ సలహాదారు చక్రవర్తి, కళాశాల ప్రిన్సిపాల్ బాలకృష్ణ, డీన్ సాయిచైతన్య కిషోర్, వైస్‌ప్రిన్సిపాల్ శ్రీనివాసులు, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ రంజిత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హౌసింగ్ ఏఈ ఆత్మహత్యాయత్నం



ఆత్మహత్యకు యత్నించిన హౌసింగ్ ఏఈ బాలాజీ

ధర్మవరం, జూలై 27: అధికారుల వేధింపులు తాళలేక స్థానిక మున్సిపాలిటీలో పనిచేస్తున్న ఏఈ అన్నంబాలాజీ ఆత్మహత్యకు యత్నించాడు. హౌసింగ్ కార్యాలయానికి శనివారం వెళ్లిన ఆయన అందరూ చూస్తుండగానే తన వెంట తెచ్చుకున్న పురుగుల మందు తాగాడు. తోటి ఉద్యోగులు వెంటనే స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోలీసులు అక్కడికి చేరుకుని కేసు నమోదు చేసుకున్నారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. హౌసింగ్ ఏఈ భార్య వనిత మాట్లాడుతూ...హౌసింగ్ పీడీ, డీఈ, మరో కిందిస్థాయి ఉద్యోగి వీరు ముగ్గురూ తరచూ వేధించేవారన్నారు. రెండు నెలల కిందట ఏకారణం లేకుండానే సస్పెండ్ చేశారన్నారు. కారణం అడిగితే పొంతనలేని సమాధానాలు చెబుతున్నారన్నారు. తన భర్తపై సస్పెన్షన్ తొలగించి, మళ్లీ ఉద్యోగంలోకి తీసుకోవడానికి హౌసింగ్ అధికారులు భారీగా డబ్బులు డిమాండ్ చేస్తున్నారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. తన భర్త రెండునెలల నుంచి అధికారుల వేధింపులతో తీవ్ర మనోవేదనకు గురయ్యాడని తెలిపారు. ఈక్రమంలోనే అఘాయిత్యానికి పాల్పడినట్లు పేర్కొన్నారు. ఈ విషయంపై మంత్రులు నారాలోకేశ్, సత్యకుమార్ దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేయాలని కోరుతానని ఆమె పేర్కొన్నారు. తన భర్త ఆత్మహత్యాయత్నానికి కారకులపై చర్యలు తీసుకోవాలని ఆమె పోలీసులను కోరారు.

ఖైదీలను ఆసుపత్రికి తీసుకెళ్లండి



ఖైదీతో మాట్లాడుతున్న జడ్జి శివప్రసాద్

అనంతపురం క్రైం,జూలై 27: ఖైదీలు అనారోగ్యంగా ఉంటే మందులివ్వాలని, అవసరమైతే జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ సర్వజనాసుపత్రికి తీసుకెళ్లాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ న్యాయాధికారి శివప్రసాద్ సూచించారు. ఆయన శనివారం జిల్లా జైలును సందర్శించారు. ఖైదీలతో మాట్లాడి, జైలులో అందుతున్న సౌకర్యాలు, ఆహారం, ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నా రు. ఖైదీలకు న్యాయ సేవల లభ్యత, అప్పీల్ హక్కు, అభ్యర్థన బేరసారాలు, లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సిస్టమ్ పనితీరు గురించి తెలియజేశారు. స్కిల్ డెవలప్‌మెంట్ ద్వారా శిక్షణ పొందిన ఖైదీలకు సర్టిఫికెట్లు జారీ చేశారు. అంతకుముందు నగరంలోని అబ్జర్వేషన్ హోమ్ ఫర్ బాయ్స్ కేంద్రాన్ని సందర్శించి సౌకర్యాలు, వారి కేసు దశ, చట్టంతో బాలల సంఘర్షణను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో జైలు సూపరింటెండెంట్ రెహమాన్, నాబార్డ్ డీడీఎం అనురాధ, స్త్రీ శక్తి సంక్షేమ సంఘం అధ్యక్షురాలు మహేశ్వరి, కెనరాబ్యాంకు మేనేజర్ సెంథిల్‌కుమార్ పాల్గొన్నారు.

ఎస్‌జీఎఫ్‌కు దరఖాస్తు చేసుకోండి

కొత్తచెరువు, జూలై 27: శ్రీసత్యసాయి జిల్లాలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్)సెక్రటరీ అండర్-14, 17 నియామకం కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు జిల్లా విద్యాశాఖ అధికారి మీనాక్షి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో ఉన్న వ్యాయామ ఉపాధ్యాయులు ఈ పోస్టులకు అర్హులన్నారు. రెండేళ్లలోపు రిటైర్ అయ్యేవారు ఈ పోస్టుకు అనర్హులని, గతంలో ఎస్‌జీఎఫ్ సెక్రటరీగా పనిచేసిన వారు అనర్హులని వెల్లడించారు. దరఖాస్తులను ఈ నెల 30లోగా జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయంలో అందజేయాలని డీఈఓ సూచించారు.

ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు ...

కొత్తచెరువు, జూలై 27: శ్రీసత్యసాయిజిల్లాలోని ప్రభుత్వ జిల్లా పరిషత్, మున్సిపల్ ప్రాథమికోన్నత, ఉన్నతపాఠశాలల్లో పనిచేస్తున్న ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు దరఖాస్తు చేసుకోవాలని డీఈఓ మీనాక్షి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తులను ఆగస్టు 5లోగా మండల విద్యాశాఖ అధికారి, ఉప విద్యాశాఖ అధికారికి అందజేయాలన్నారు. దరఖాస్తు చేసుకునే వారు కనీసం 15 సంవత్సరాలు బోధనా అనుభవం కల్గిఉండాలి. రాష్ట్రస్థాయికి దరఖాస్తు చేసుకునే వారు గతంలో జిల్లా స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు పొంది ఉండాలి. దరఖాస్తు చేసుకునే ఉపాధ్యాయులపై ఎటువంటి క్రిమినల్ కేసులు, ఆర్టికల్ ఆఫ్ చార్జెస్, శాఖ పరమైన క్రమశిక్షణ చర్యలు ఉండరాదు. జాతీయ అవార్డుకు దరఖాస్తు చేసుకునే వారు అనర్హులు.

ఎయిర్‌ఫోర్స్ ఉద్యోగాలకు ...

అంతపురం సెంట్రల్, జూలై 27: ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ ఉద్యోగాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పన అధికారి కళ్యాణి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇంటర్మీడియట్ మ్యాథమేటిక్స్, ఫిజిక్స్, ఇంగ్లిష్ సబ్జెక్టుల్లో కనీసం 50శాతం మార్కులు, మూడేళ్ల ఇంజనీరింగ్ డిప్లొమా, తత్సమాన విద్యార్హతలు కలిగిన యువతీ, యువకులు అర్హులన్నారు. http-s://agnipathvayucdac.in/ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేయాలని సూచించారు. వివరాలకు 08554 245547 నెంబర్‌కు సంప్రదించాలని కోరారు.

పాముకాటుతో విద్యార్థి మృతి



దాసరి జోషి ఫైల్‌ఫొటో

కణేకల్లు, జూలై 27: మండలంలోని గెణిగెర గ్రామానికి చెందిన భీమలింగ, శాంతి దంపతుల కుమారుడైన దాసరి జోషి(8) పాముకాటుతో శుక్రవారం రాత్రి మృతి చెందాడు. మండలంలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో రెండో తరగతి చదువుతున్న జోషి శుక్రవారం రాత్రి తల్లిదండ్రులతో పాటు తమ ఇంట్లో నిద్రించాడు. అర్ధరాత్రి సమయంలో ఏదో కుట్టిందని, నొప్పిగా ఉందని బాలుడి లేచి తల్లిదండ్రులకు తెలిపాడు. దీంతో వారు వెంటనే ఇల్లంతా పరిశీలించారు. పాము కనపడటంతో దాన్ని చంపి, జోషిని కణేకల్లు క్రాసింగ్‌లోని ఆర్డీటీ ఆసుపత్రికి తీసుకెళ్లారు. వైద్యులు పరీక్షించి మృతి చెందినట్లు తెలిపారు. దీంతో తల్లిదండ్రుల రోదనలు మిన్నంటాయి.

విద్యుత్ తీగ తెగిపడి వ్యక్తి మృతి

● **మడకశిర సమీపంలో ప్రమాదం**



విద్యుత్ తీగ తెగిపడి మృతి చెందిన పెన్నోబులేసు ఇన్‌సెట్‌లో రోదిస్తున్న భార్య

మడకశిర టౌన్, జూలై 27: పట్టణ సమీపంలో విద్యుత్ తీగ తెగి మీద పడటంతో పెనుకొండ పట్టణానికి చెందిన పెన్నోబులేసు(38) అనే వ్యక్తి మృతిచెందాడు. యాదవ కల్యాణ మండపం సమీపంలో శనివారం మధ్యాహ్నం ఈ ప్రమాదం చోటు చేసుకుంది. 11 కేవీ లైన్ వైర్లు చింత చెట్లపై పడుతుండటంతో ప్రమాద నివారణ కోసం విద్యుత్ శాఖ అధికారులు ఇన్సులేటర్‌ను అమర్చారు. బలమైన గాలులు వీయడంతో శనివారం చింతకొమ్మలు తగిలి ఇన్సులేటర్ పగిలి.. విద్యుత్ తీగ తెగిపోయింది. అదే సమయంలో బైక్ మీద వెళుతున్న పెన్నోబులేసుపై ఆ తీగ పడటంతో అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకొన్న విద్యుత్ శాఖ అధికారులు విద్యుత్ సరఫరాను నిలిపివేసి మరమ్మతులు చేపట్టారు. గతంలో ఇదే లైన్‌పై తీగలు రాసుకుని మంటలు ఎగసిపడ్డాయి. ఫైర్ సిబ్బంది వచ్చి ఆర్పివేయాల్సి వచ్చింది. ఆ తరువాత కొన్నాళ్లకే విద్యుత్ తీగ తెగిపోయింది. ఆ సమయంలో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. ఇలా పదే పదే తీగలు తెగిపోతున్నా విద్యుత్ శాఖ అధికారులు గట్టి చర్యలు తీసుకోలేదు. వారి నిర్లక్ష్యం కారణంగానే ఓ ప్రాణం పోయిందని పట్టణ వాసులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మృతుడికి భార్య సుమలత, ఇద్దరుకుమారులు ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. గతంలో చింతచెట్టు కొమ్మలను నరికివేసేందుకు తమ సిబ్బంది ప్రయత్నించారని,చెట్టు యజమాని అడ్డుకోవడంతో ఇన్సులేటర్‌ను ఏర్పాటు చేసినట్లు విద్యుత్‌శాఖ ఏడీ సుబ్రహ్మణ్య ప్రసాద్ పేర్కొన్నారు.

అసెంబ్లీకి రాలేక మొహం చాటేసిన జగన్: మంత్రి సవిత



మీడియాతో మాట్లాడుతున్న మంత్రి సవిత

పెనుకొండ టౌన్, జూలై 27: ప్రజా సమస్యలపై పోరాటం చేయకుండా, అసెంబ్లీకి రాలేక పులివెందుల ఎమ్మెల్యే జగన్ మొహం చాటేస్తున్నారని బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత అన్నారు. శ్రీసత్యసాయి జిల్లా పెనుకొండలో శనివారం ఆమె పలు అభివృద్ధి కార్యక్రమాలలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించి, స్వర్ణాంధ్రప్రదేశ్‌గా మారుస్తారన్న నమ్మకంతో ఎన్‌డీఏ కూటమికి ప్రజలు సంపూర్ణ మెజార్టీతో అధికారం ఇచ్చారని అన్నారు. కక్షసాధింపు చర్యలకు వెళ్లకుండా, అభివృద్ధి బాటలో వెళ్లాలని, ప్రజలకు ఏం కావాలో వారి వద్దకు వెళ్లి తెలుసుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఇప్పటికే తమకు దిశానిర్దేశం చేశారని అన్నారు. ఎన్‌డీఏ ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి రాష్ట్రంలో 36 హత్యలు జరిగాయని జగన్ అంటున్నారని, వాటికి సంబంధించిన ఎఫ్ఐఆర్ కాపీలను తీసుకురావాలని ఇప్పటికే హోం మంత్రి ఓపెన్ ఛాలెంజ్ చేశారని అన్నారు. ఎఫ్ఐఆర్ కాపీ తీసుకు రమ్మంటే.. జగన్ అసెంబ్లీకి రావడం లేదని అన్నారు. ప్రజల కోసం పోరాటం చేయకుండా ఢిల్లీలో నిరసన తెలిపితే సమస్యలు పరిష్కారం అవుతాయా అని ప్రశ్నించారు. జగన్ పాలనలో అన్ని శాఖలలో అవినీతి జరిగిందని, తోడేకొద్దీ బయటకు వస్తోందన్నారు. రాష్ట్రంలో అప్పులు రూ.కోట్లలో పేరుకుపోయాయని అన్నారు.

అవార్డులు అందుకున్న భరత్, జీవన్



కేంద్ర మంత్రి నుంచి అవార్డు అందుకుంటున్న బిసాటి భరత్

అనంతపురం క్లాక్‌టవర్, జూలై 27: కేంద్ర ఎలక్ట్రానిక్స్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖ, డిజిటల్ ఇండియా విభాగం మై గవర్నమెంట్ అంబాజిడర్, సాతీ అవార్డులను జిల్లాకు చెందిన బిసాటి భరత్, జీవన్ కుమార్ అందుకున్నారు. ఢిల్లీలో కేంద్ర ఐటీ శాఖ మంత్రి జితిన్‌ప్రసాద్ చేతుల మీదుగా శనివారం వీరు ఈ అవార్డులను అందుకున్నారు. ప్రధాన మంత్రి ఉజ్వల యోజన, ప్రధానమంత్రి బీమా యోజన, క్యాష్‌లెస్ ఇండియా, డిజీలాకర్, ఉమంగ్ యాప్ ఆత్మనిర్భర్ భారత్, మేరీ మిట్టి మేరా దేశ్, ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ వంటి కేంద్ర ప్రభుత్వ కార్యక్రమాలను గత పదేళ్లుగా ప్రజల్లోకి తీసుకెళ్లినందుకుగాను వీరికి అవార్డులు అందజేశారు.



అవార్డు అందుకుంటున్న జీవన్‌కుమార్

ఎంఫార్మసీ ఫలితాలు విడుదల

అంతపురం సెంట్రల్, జూలై 27: జేఎన్‌టీయూ ఆధ్వర్యంలో నిర్వహించిన ఎంఫార్మసీ పరీక్ష ఫలితాలను విడుదల చేసినట్లు డైరెక్టర్ ఎవాల్యుయేషన్ కేశవరెడ్డి, సీఈ చంద్రమోహన్‌రెడ్డి శనివారం తెలిపారు. మే, జూన్‌లో ఎంఫార్మసీ నాలుగో సెమిస్టర్(ఆర్21) రెగ్యులర్, సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించామన్నారు. నాలుగో సెమిస్టర్(ఆర్17) సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. విద్యార్థులు వారి ఫలితాలకోసం www.jntua.ac.in వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు.

నేడు మంత్రి సత్యకుమార్ రాక

అంతపురం సెంట్రల్/ధర్మవరం, జూలై 27: రాష్ట్ర వైద్యఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్‌యాదవ్ ఆదివారం ఉమ్మడి జిల్లాలో పలు కార్యక్రమాల్లో పాల్గొననున్నట్లు బీజేపీ నాయకులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 3 గంటలకు ధర్మవరంలోని సీబీఎన్ ఫంక్షన్ హాల్‌లో ప్రజాసమస్యలపై సమావేశం, 5గంటలకు చేనేత కార్మికుల సమస్యలపై సమావేశం, 6గంటలకు వ్యాపారులతో సమావేశాలు ఉంటాయని నాయకులు పేర్కొన్నారు. అలాగే ఉదయం అనంతపురంలోని బీజేపీ జిల్లా కార్యాలయంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మన్‌కీ బాత్ ప్రచార కార్యక్రమంలో పాల్గొంటారని తెలిపారు.

నేటి నుంచి డిపార్ట్‌మెంట్ పరీక్షలు

అనంతపురం టౌన్, జూలై 27: డిపార్ట్‌మెంట్ పరీక్షలు ఆదివారం నుంచి జరుగుతాయని కలెక్టరు వినోద్‌కుమార్, డీఆర్ఓ రామక్రిష్ణారెడ్డి శనివారం తెలిపారు. ఇందుకోసం నాలుగు కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. ఆబ్జెక్టివ్ తరహాలో నిర్వహించే ఈ పరీక్షలు ఉదయం 10గంటల నుంచి 12వరకు, మధ్యాహ్నం 3గంటల నుంచి సాయంత్రం 5వరకు జరుగుతాయన్నారు. థియరీ టైపు పరీక్షలు ఉదయం 10 గంటల నుంచి 1గంట వరకు, మధ్యాహ్నం 3గంటల నుంచి 6 గంటల వరకు ఉంటాయన్నారు. పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులు 15 నిమిషాలు ముందే కేంద్రాలకు చేరుకోవాలన్నారు. మొబైల్ ఫోన్లు, ఇతర ఎలక్ట్రానిక్స్ పరికరాలు తీసుకురాకూడదన్నారు. పెన్సిల్, హాల్‌టికెట్,తోపాటు ప్రభుత్వం గుర్తించిన ఏదైనా కార్డు తీసుకొని హాజరుకావాలన్నారు.

ఇళ్ల వద్దకే పింఛన్

● **ఆగస్టులో మొత్తం రూ.126 కోట్ల పంపిణీ**



అనంతపురం క్లాక్‌టవర్, జూలై 27: ఇళ్ల వద్దకే ఎన్టీఆర్ సామాజిక భద్రత పింఛన్ అందజేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. గత నెలలో పంపిణీ చేసిన తరహాలోనే ఆగస్టు నెలలోనూ లబ్ధిదారుల ఇంటివద్దనే అందజేయాలని ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు సెర్ప్ సీఈఓ వీరపాండ్యన్ ఉత్తర్వులు జారీ చేశారు. మొదటి రోజే 99శాతం పంపిణీ పూర్తి చేయాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. గ్రామ-వార్డు సచివాలయ ఉద్యోగుల ద్వారా పింఛన్ ఇంటి వద్దనే అందజేయనున్నారు. లబ్ధిదారులు ఎవరూ సచివాలయాలు, ఇతర ప్రభుత్వ కార్యాలయాలు, బ్యాంకుల వద్దకు వెళ్లాల్సిన అవసరం లేదు. రెండు రోజుల్లో పంపిణీ పూర్తి చేయాలని, అదనంగా పంపిణీకి సమయం ఇవ్వబోమని స్పష్టం చేశారు. ఈనెల 31న గ్రామ-వార్డు సచివాలయ ఉద్యోగులు బ్యాంకుల నుంచి నగదు మొత్తాన్ని డ్రా చేసి సిద్ధంగా భద్రపరుచుకోవాలన్నారు. పంపిణీ చేసి మిగిలిన మొత్తాన్ని రెండు రోజుల్లోపు సెర్ప్‌కు తిరిగి చెల్లించాలని సూచించారు. చెల్లించని పింఛన్లన్నింటికీ కారణా లు ఆయా గ్రామ-వార్డు వెల్ఫేర్ అసిస్టెంట్లు 5లోపు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. జిల్లాలో 2,87,656మంది పింఛన్‌దారులకు రూ.126కోట్లు నిధులు మంజూరు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఆగస్టు నెలకు సంబంధించి మొత్తాన్ని విడుదల చేసింది. ఇందులో వృద్ధులు 1,42,954 మందికి రూ.57.18కోట్లు, వితంతువులు 66,616మందికి రూ.26.64కోట్లు, చేనేత లు 6,697మందికి రూ.2.67కోట్లు, కల్లుగీత కార్మికులు 354మందికి రూ.14.2 లక్షలు, మత్స్యకారులు 887మందికి రూ.35.5లక్షలు, ఒంటరి మహిళలు 6,717 మందికి రూ.2.68కోట్లు, సఫాయి కర్మాచారులు 3,506మందికి రూ.1.40కోట్లు, హిజ్రాలు 207మందికి రూ.83వేలు, హెచ్ఐవీ బాధితులు 2,437మందికి రూ.97.5లక్షలు, డప్పు కళాకారులు 3,129మందికి రూ.1.25కోట్లు, కళాకారులు 182మందికి రూ.73వేలు, అభయ హస్తం 4,233మందికి రూ.2.12లక్షలు, దివ్యాంగులు 46,242మందికి రూ.27.74కోట్లు, కుష్టు వ్యాధి బాధితులు 387మందికి రూ.23లక్షలు, మంచానికే పరిమితమైన బాధితులు 1,440మందికి రూ.1.63 కోట్లు, ప్రమాద బాధితులు 1089మందికి రూ.1.63కోట్లు ఇతరత్ర బాధితులకు కలిపి మొత్తం 2,87,656మందికి రూ.126కోట్లు ఆగస్టులో పంపిణీ చేయనున్నారు. ఆగస్టు ఒకటో తేదీ నుంచి ఇంటివద్దకే పింఛన్‌లు పంపిణీ చేస్తామని డీఆర్‌డీఏ-వైకేపీ పీడీ ఓబుళమ్మ తెలిపారు. ఇప్పటికే ఆయా గ్రామ, వార్డు సచివాలయాలకు నిధులు విడుదల చేశామని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల ఆయా మండల ఎంపీడీఓలు, మున్సిపాలిటీలలో ఆయా కమిషనర్లు పంపిణీ బాధ్యతను పర్యవేక్షిస్తారని తెలిపారు.

కళాశాలల్లో మధ్యాహ్న భోజనం పునఃప్రారంభించాలి

● ఎస్ఎఫ్ఐ డిమాండ్.. ఆర్ఐఓ ఆఫీస్ వద్ద ఆందోళన


నిరసన తెలుపుతున్న నాయకులు

అనంతపురం విద్య, జూలై 27: ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజనం వెంటనే ప్రారంభించాలని ఎస్ఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. శనివారం ఆర్ఐఓ ఆఫీస్ వద్ద ఆందోళన చేపట్టారు. ఆ సంఘం జిల్లా కార్యదర్శి పరమేష్ మాట్లాడుతూ... కరువు జిల్లా అనంతపురం వ్యాప్తంగా ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో పేద, మధ్యతరగతి కుటుంబాల విద్యార్థులు చదువుతున్నారన్నారు. గత వైసీపీ ప్రభుత్వం జూనియర్ కళాశాలల్లో అమలవుతున్న ఎండీఎంను రద్దు చేసిందన్నారు. దీంతో లక్షలాది మంది విద్యార్థులు అర్ధాకలితో విద్యను అభ్యసించే పరిస్థితులు వచ్చాయరన్నారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చి చదువుకోలేక చాలా మంది జూనియర్ కళాశాలలకు దూరమయ్యారని, అయినా అప్పటి ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. కొత్తగా కొలువుదీరిన ప్రభుత్వం కళాశాలల్లో మధ్యాహ్న భోజనం అమలయ్యేలా చూడాలన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా బాలికల కన్వీనర్ రజిత, జిల్లా ఉపాధ్యక్షులు గిరి, సిద్దు, జిల్లా సహాయ కార్యదర్శి సూర్యప్రకాష్, సోము, గణేష్, మహేష్, సాయి, వరుణ్, అరవింద్ పాల్గొన్నారు.

సీపీఆర్‌పై వైద్య సిబ్బందికి శిక్షణ


సీపీఆర్ గురించి ఆస్పత్రి సిబ్బందికి ప్రాక్టికల్‌గా చేసి చూపుతున్న డాక్టర్లు

అనంతపురం టౌన్, జూలై 27: గుండెపోటుకు గురైన వ్యక్తి ప్రాణాలు కాపాడేందుకు సీపీఆర్ అత్యవసర చికిత్సగా మారడంతో జిల్లా ఆస్పత్రిలో శనివారం డాక్టర్లు, వైద్యసిబ్బందికి శిక్షణ ఇచ్చారు. డాక్టర్ నవీన్‌కుమార్, డాక్టర్ నూరుల్లాఖాన్ గుండెపోటు వచ్చినపుడు సీపీఆర్ చేస్తే బాధితుల ప్రాణాలు కాపాడవచ్చని, ఆసీపీఆర్‌ను ఎలాచేయాలి అనేదానిపై ప్రాక్టికల్‌గా చూపిస్తూ అవగాహన కల్పించారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఇటీవల కాలంలో గుండెపోటు కేసులు పెరిగిపోయాయన్నారు. గుండెపోటు వచ్చిన సమయంలో సీపీఆర్ చేస్తే బాధితులు అధిక శాతం బతికే అవకాశాలు ఉంటాయన్నారు. అందుకే ప్రజలు, వైద్యనిపుణులు ప్రతి ఒక్కరూ సీపీఆర్ నేర్చుకోవాలని సూచించారు. జిల్లా ఆస్పత్రిలో పనిచేస్తున్న ప్రతి డాక్టర్, నర్సులు, సిబ్బంది సీపీఆర్ ఎలా చేయాలో అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఆర్ఎంఓలు డాక్టర్ పద్మజ, డాక్టర్ హేమలత, డాక్టర్ సునీత పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలపై 1 నుంచి జీపు జాతా

అనంతపురం విద్య, జూలై 27: ప్రభుత్వ హాస్టళ్లలో విద్యారంగ సమస్యలపై ఆగస్టు 1 నుంచి జీపు జాతా నిర్వహిస్తున్నట్లు ఏఐఎస్ఎఫ్ నాయకులు పేర్కొన్నారు. శనివారం సీపీఐ కార్యాలయంలో జీపుజాతా పోస్టర్లు ఆవిష్కరించారు. సంఘం జిల్లా అధ్యక్షుడు రమణయ్య, ప్రధాన కార్యదర్శి కుల్లాయిస్వామి మాట్లాడుతూ జాతా అనంతపురంలో ప్రారంభమై నార్పల, తాడిపత్రి, గుత్తి, గుంతకల్లు, ఉరవకొండ, కణేకల్లు, రాయదుర్గం, కళ్యాణదుర్గం, ఆత్మకూరు, రాప్తాడు వరకూ నిర్వహిస్తామన్నారు. మూడు రోజులపాటు సాగుతుందన్నారు. విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం ఈ జాతాకు శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. మూడు రోజుల జాతా అనంతరం కలెక్టరేట్ వద్ద ధర్నా చేపడతామన్నారు. సంఘం జిల్లా కోశాధికారి హనుమంతు, రాష్ట్ర సమితి నాయకులు సాయి స్వరూప, ఉపాధ్యక్షుడు నరసింహ, ఆంజనేయులు, మంజునాథ్, ఉమామహేష్, రాధా జ్యోతి, హర్ష, చైతన్య పాల్గొన్నారు.

ఏపీ స్టూడెంట్స్ జేఏసీ జిల్లా అధ్యక్షుడిగా అమర్


అమర్‌కు నియామకపత్రం అందజేస్తున్న రాష్ట్ర అధ్యక్షుడు

అనంతపురం విద్య, జూలై 27: ఆంధ్రప్రదేశ్ స్టూడెంట్స్ జేఏసీ జిల్లా అధ్యక్షుడిగా అమర్ యాదవ్‌ను నియమించినట్లు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు హేమాద్రి యాదవ్ తెలిపారు. శనివారం సాయినగర్‌లోని ఆ సంఘం కార్యాలయంలో సమావేశం నిర్వహించి అన్ని జిల్లాల కమిటీలను నియమించారు. అనంతపురం జిల్లా అధ్యక్షులుగా అమర్‌యాదవ్‌ను, ఉపాధ్యక్షులుగా అభిరామ్, ప్రశాంత్, ప్రధానకార్యదర్శిగా రాజేష్, కార్యదర్శులుగా విజయయాదవ్, పార్థసారథిని నియమించారు. అనంతరం రాష్ట్ర అధ్యక్షుడు మాట్లాడుతూ గత ప్రభుత్వం మొదలెట్టిన నాడు-నేడు పనులు ఇంకా పూర్తికాలేదన్నారు. కొత్త ప్రభుత్వం పూర్తి చేసి, స్కూళ్లను కార్పొరేట్‌కు దీటుగా తీర్చిదిద్దాలన్నారు. సంఘం ఉపాధ్యక్షుడు ముక్తార్‌బాషా, ప్రధానకార్యదర్శి ఉత్తన్న, తిరుపతి జిల్లా అధ్యక్షుడు శ్రీధర్, అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు గంగారాజు, నరేష్, సాయి, శివుడు, రవి పాల్గొన్నారు.

ఏపీజీఈఏ సంఘం ఒక్కటే

● అధ్యక్షుడు గోపీకృష్ణ


మాట్లాడుతున్న ఏపీజీఈఏ నాయకులు

అనంతపురం ప్రెస్‌క్లబ్, జూలై 27: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం ఒక్కటేనని.. రెండు మూడు లేవని ఏపీజీఈఏ జిల్లా అధ్యక్షుడు గోపీకృష్ణ స్పష్టం చేశారు. సంఘంలో బహిష్కరణకు గురైన వారు సంఘాన్ని రెండుగా చీల్చాలని చూడటం అవివేకమన్నారు. ఈ మేరకు శనివారం ఆ సంఘం కార్యాలయంలో గోపీకృష్ణ ఆధ్వర్యంలో విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ 22వ తేదీన విజయవాడలో జరిగిన రాష్ట్రస్థాయి సమావేశంలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆస్కార్‌రావును పదవి నుంచి తొలగించారన్నారు. ఆయన గతంలో సంఘం నుంచి బహిష్కరించిన వారితో కలిసి ఏపీజీఈఏ సంఘం మాదంటూ తమకిష్టమైన వారికి పదవులు ప్రకటించుకొని తప్పుదోవ పట్టిస్తున్నారన్నారు. ఈ విషయంలో సంఘంలోని నాయకులు ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. సమావేశంలో రామునాయక్, వేణుగోపాల్, సాంబశివమ్మ, ఓబిరెడ్డి, మౌలాసాహెబ్, వినోద్‌కుమార్, నాగేశ్వరయ్య, ఈశ్వరయ్య పాల్గొన్నారు.

మద్యం ధ్వంసం చేసిన సెబ్ పోలీసులు

అనంతపురం క్రైం, జూలై 27: వివిధ కేసుల్లో పట్టుబడిన మద్యాన్ని అనంతపురం సెబ్ పోలీసులు శనివారం ధ్వంసం చేశారు. అనంతపురం సెబ్ స్టేషన్లో డీపీఎల్, ఎన్‌డీపీఎల్, ఐడీ మొత్తం 89 కేసుల్లో రూ.7 లక్షల విలువైన మద్యాన్ని సెబ్ ఏఎస్పీ రామక్రిష్ణ ఆధ్వర్యంలో టీవీ టవర్ వెనుక భాగంలోని ఖాళీ స్థలంలో ధ్వంసం చేశారు. సెబ్ సీఐ యల్లయ్య, ఎస్ఐ సరస్వతి సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వంపై దుష్ప్రచారం తగదు

దర్మవరం రూరల్(కనగానపల్లి), జూలై 27: టీడీపీ ప్రభుత్వం పింఛన్లు తొలగిస్తున్నారని వైసీపీ నాయకులు దుష్ప్రచారం చేయడం తగదని టీడీపీ ప్రజా ప్రతినిధులు అన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ కుంపటి భాగ్యమ్మ అధ్యక్షతన శనివారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. నరసంపల్లి, ముత్తవకుంట్ల, పాతపాళ్యం సర్పంచులు సోమర చంద్రశేఖర్, రామాంజనేయులు, పూజారి రాజాకృష్ణ, అంకే రామకృష్ణ ఎంపీపీ, జడ్పీటీసీ మారుతి ప్రసాద్‌తో వాగ్వాదానికి దిగారు. పింఛన్లు అర్హులైన వారికి తొలగించకూడదని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత ఆదేశించారన్నారు. మండల కన్వీనర్ పోతులయ్య రాష్ట్ర కార్యదర్శి నెట్టెం వెంకటేష్ ఎంపీటీసీలు భాస్కర్, పెద్దప్పయ్య ఈఓఆర్డీ అనిల్ కుమార్ పాల్గొన్నారు.

సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిపై వివక్ష తగదు

● అఖిల పక్ష నాయకులు



సమావేశంలో మాట్లాడుతున్న ఐక్యవేదిక నాయకులు

అనంతపురం టౌన్, జూలై 27: అనంత జిల్లా ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ఏర్పాటు చేసిన సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిపై పాలకులు వివక్ష చూపడం అన్యాయమని అఖిలపక్షం నాయకులు మండిపడ్డారు. శనివారం శారదానగర్ వద్దనున్న సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి ఎదుటే ఏపీ పట్టణ పౌర సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో అఖిలపక్ష సమావేశం నిర్వహించారు. సంఘం గౌరవాధ్యక్షుడు రిటైర్డ్ అధ్యాపకులు చంద్రశేఖర్ మాట్లాడుతూ 2014లో సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రిని రూ.120కోట్లతో నిర్మించారన్నారు. జిల్లాకు ఎయిమ్స్ రావాల్సి ఉండగా చివరకు సూపర్ స్పెషాలిటీని ఏర్పాటు చేశారన్నారు. అయితే ఇప్పటికీ ఆస్పత్రిలో పూర్తిస్థాయి వసతులు, నియామకాలు చేపట్టకపోవడం బాధాకరమన్నారు. ప్రజలకు వైద్యసేవలు అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్ మాట్లాడుతూ ఇంతపెద్ద ఆస్పత్రి నిర్మించి నిర్వహణ గాలికొదిలివేయడం సరికాదన్నారు. టీడీపీహయాంలో నిర్మించినా గత వైసీపీ ప్రభుత్వం సేవలు ప్రారంభించినా ఇక్కడమాత్రం అనుకున్న లక్ష్యం మేరకు రోగులకు సేవలు అందడం లేదన్నారు. సూపర్‌స్పెషాలిటీ నిర్వహణకు ప్రత్యేక నిధులు ఇవ్వకుండా జిల్లా ప్రభుత్వ ఆస్పత్రినుంచే నడపడం చూస్తేనే ఇక్కడ ఎంత అధ్వాన పరిస్థితులు ఉన్నాయో తెలుస్తుందన్నారు. సీపీఐ, సీపీఎం నాయకులు శ్రీరాములు, నల్లప్ప మాట్లాడుతూ ఆస్పత్రి ఏర్పాటుచేసి ఇన్ని సంవత్సరాలైనా నేటికీ సదుపాయాలు లేకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. రానున్న బడ్జెట్‌లోనైనా ప్రత్యేక నిధులు కేటాయించాలని, ఖాళీగా ఉన్న డాక్టర్లు, ఇతర సిబ్బందిని నియమించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ ప్రసూన, ఐక్యవేదిక అధ్యక్షుడు రసూల్, కార్యదర్శి రాజమోహన్, చంద్రశేఖరరెడ్డి, వరదరాజులు, రిటైర్డ్ తహసీల్దార్ జయరామప్ప, రాజు, సోమర రాహుల్, సత్యనారాయణరెడ్డి, వీరేంద్ర, శంకర్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యేలకు సన్మానం


ఎమ్మెల్యేలను సన్మానిస్తున్న పంచాయతీరాజ్ చాంబర్ సభ్యులు

శింగనమల జూలై 27: ఎమ్మెల్యేలను పంచాయతీరాజ్ చాంబర్ కార్యవర్గ సభ్యులు ఘనంగా సన్మానించారు. శనివారం విజయవాడ బాలోత్సవ భవన్‌లో చాంబర్ సభ్యులుగా ఉన్న ఎమ్మెల్యేలు దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్, గొండు శంకర్‌ను చాంబర్ జాతీయ అధ్యక్షుడు వైవీబీ రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో సన్మానించారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి ప్రతాఎరెడ్డి, సర్పంచుల సంఘం అధ్యక్షుడు వాసువల్లి లక్ష్మీముత్యాలరావు, కార్యనిర్వాహక కార్యదర్శి డేగల కృష్ణమూర్తి, ప్రతాప్‌నాయుడు, ఇస్మాయిల్, వేలూరు రంగయ్య, గోనుగుంట్ల భూషణ్ వీరేష్ పాల్గొన్నారు.

ఎస్పీని కలిసిన ఎమ్మెల్యే పల్లె సింధూరా రెడ్డి


ఎస్పీకి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎమ్మెల్యే, మాజీ మంత్రి పల్లె

అనంతపురం అర్బన్, జూలై 27: పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూరా రెడ్డి అనంతపురం జిల్లా ఎస్పీ మురళీకృష్ణను కలిశారు. శనివారం ఎస్పీ చాంబర్‌లో ఎస్పీ మురళీకృష్ణను ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి, పీవీకేకే కళాశాల చైర్మన్ పల్లె వెంకటకృష్ణ మర్యాదపూర్వకంగా కలిసి శాలువాలు, పూలమాలలతో సత్కరించారు. ఎస్పీ మాట్లాడుతూ జిల్లాకు ఎస్పీగా రావడం తాను అదృష్టంగా భావిస్తున్నానని, అందరం కలిసి ప్రజలకు జవాబుదారిగా పనిచేద్దామన్నారు. ఎస్పీని కలిసిన వారిలో కేరళ మాజీ డీజీపీ శంకర్‌రెడ్డి ఉన్నారు.

వీరశైవులకు నామినేటెడ్ పదవులు కేటాయించాలి


మాట్లాడుతున్న ఎంజీ రాజు

అనంతపురం కల్చరల్, జూలై 27: ఎన్నికలకు ముందు సీఎం చంద్రబాబు ఇచ్చిన హామీ మేరకు వీరశైవులకు నామినేటెడ్ పదవులు కేటాయించాలని ఆ సంఘం అధ్యక్షుడు ఎంజీ రాజు డిమాండ్ చేశారు. శనివారం వీరశైవ సమాజం జిల్లా కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. శ్రీశైల దేవస్థానం పాలకమండలి చైర్మన్ పోస్టును వీరశైవులకు కేటాయించాలన్నారు. తిరుమల తిరుపతి దేవస్థానం పాలకమండలిలో ఒకరినైనా సభ్యుడిగా నియమించాలన్నారు. తిరుమల కొండపై క్షేత్రపాలకుడు శివుడేనని, అయినా అక్కడ ఇంతవరకూ వీరశైవులకు ఎలాంటి సత్రం లేదన్నారు. కొండపై సత్రం ఏర్పాటు చేసి వీరశైవ పీఠం నెలకొల్పేందుకు కొంత స్థలం కేటాయించాలని కోరారు. వీరశైవ జంగమ అధ్యక్షుడు మఠం తిప్పేస్వామి, కార్యదర్శి గౌళి సతీష్‌కుమార్, ఉపాధ్యక్షుడు మహేష్, కోశాధికారి మల్లికార్జున, గౌరవ సలహాదారు మఠం సాంబయ్య, గౌరవాధ్యక్షుడు నాగన్న పాల్గొన్నారు.

శానిటేషన్ ప్రత్యేక డ్రైవ్‌ను జయప్రదం చేయండి

అనంతపురం న్యూటౌన్, జూలై 27: జిల్లాలో చేపట్టనున్న శానిటేషన్ ప్రత్యేక డ్రైవ్‌ను ప్రణాళిక ప్రకారం చేపట్టి జయప్రదం చేయాలని డీపీఓ ప్రభాకర్ రావు సూచించారు. శనివారం కలెక్టర్ నుంచి వచ్చిన ఉత్తర్వులను ఆయన వివరించారు. ఈ నెల 25 నుంచి ఆగస్టు 10 వరకు చేపట్టనున్న శానిటేషన్ ప్రత్యేక డ్రైవ్‌ను గ్రామస్థాయిలో పూర్తిగా అమలయ్యేలా ఫీల్డ్ సిబ్బంది తగిన చర్యలు తీసుకోవాలన్నారు. పారిశుధ్యం మెరుగుతో పాటు తాగునీటి సరఫరాకు సంబంధించి కమిషనర్ నుంచి విధివిధానాలు వెలువడ్డాయన్నారు. దీని కోసం జిల్లాస్థాయిలో నోడల్ అధికారిగా డీపీఆర్సీ జిల్లా కోఆర్డినేటర్‌ను నియమించామన్నారు. మండల స్థాయిలో మండల విస్తరణ అధికారి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈలతో కమిటీని ఏర్పాటు చేశామన్నారు. వీటిపై ఫిర్యాదుల స్వీకరణకు టోల్‌ఫ్రీ నంబర్ 7013681448 ద్వారా జిల్లాలో ఎక్కడ ఎలాంటి సమస్య తలెత్తినా ఫిర్యాదు చేయవచ్చన్నారు.

కార్యకర్తలకు అండగా ఉంటా

● ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ

శింగనమల జూలై 27: నియోజకవర్గంలో తన గెలుపునకు సహకరించిన టీడీపీ కార్యకర్తలకు, నాయకులకు అండగా ఉంటానని ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ అన్నారు. తన కుటుంబ సభ్యులపై కొందరు మీడియాలో అసత్యప్రచారం చేయడంతో ఆమె శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. నియోజకవర్గంలో కొంత మంది వ్యక్తులు ఎమ్మెల్యే కుటుంబసభ్యులు ప్రభుత్వం పాలనలో జోక్యం చేసుకుని పార్టీ కార్యకర్తలకు అన్యాయం చేస్తున్నట్లు మీడియాలో అసత్య ప్రచారం చేయడం వెంటనే మానాలని కోరారు. ఎస్సీ నియోజకవర్గంలో ఒక మహిళా ఎమ్మెల్యే కష్టపడుతూ సంక్షేమ కోసం నియోజకవర్గ అభివృద్ధి కోసం పనిచేసుంటే ఇలా కించపరిచే వార్తలను ప్రచారం చేయడం దారుణమన్నారు. మనోధైర్యాన్ని తగ్గించే విధంగా ప్రచారాలు చేస్తే ఉరుకునేది లేదని హెచ్చరించారు. ఎన్నో సమస్యలు ఉన్నాయని, వాటి మీద శ్రద్ధ చూపాలని, సమాజం కోసం నిజమైన సమాచారాన్ని ప్రజలకు అందించే బాధ్యతను కొన్ని మీడియాలు మరిచిపోయాయని ఆందోళన వ్యక్తం చేశారు. స్వలాభం కోసం ఇలాంటి దుష్ప్రచారాలు చేయడం సరైన పద్ధతి కాదన్నారు.

టీడీపీ నాయకుడి కుమారుడికి పరామర్శ


గణేష్‌ను పరామర్శిస్తున్న వెంకటశివుడు యాదవ్

అనంతపురం అర్బన్, జూలై 27: పామిడి మండలం కోనేపల్లికి చెందిన టీడీపీ నాయకుడు రామకృష్ణ కుమారుడు గణేష్‌ను ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్ పరామర్శించారు. రోడ్డు ప్రమాదంలో గాయపడిన గణేష్ అనంతపురంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న వెంకటశివుడు యాదవ్ శనివారం ఆస్పత్రికి వెళ్లి ఆయన్ను పరామర్శించారు. మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆస్పత్రి వైద్యులకు సూచించారు.

విద్యార్థులు సోదర భావంతో మెలగాలి: సీఐ



మాట్లాడుతున్న సీఐ నరేంద్రరెడ్డి

అనంతపురం సెంట్రల్, జూలై 27: కళాశాలలో విద్యార్థులందరూ సోదరభావంతో మెలగాలని ఇటుకలపల్లి సీఐ నరేంద్రరెడ్డి అన్నారు. శనివారం అనంతలక్ష్మి ఇంజనీరింగ్ కళాశాలలో యాంటీ ర్యాగింగ్ అవగాహన సదస్సును నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన సీఐ మాట్లాడుతూ ర్యాగింగ్‌కు పాల్పడితే కఠిన శిక్షలు అనుభించాల్సి ఉంటుందని హెచ్చరించారు. సుహృద్భావ వాతావరణంలో చదువుకుని తల్లిదండ్రుల కలలను సాకారం చేయాలని కోరారు. కళాశాల యాంటీ ర్యాగింగ్ కమిటీ ఇన్‌చార్జి రామాంజనేయులు, ప్రిన్సిపాల్ రామ్మూర్తి, విభాగాధిపతులు ప్రసాద్, రాయుడు పాల్గొన్నారు.

అబ్దుల్ కలాంకు నివాళి


అబ్దుల్ కలాం చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న టీడీపీ నాయకులు

అనంతపురం రూరల్, జూలై 27: మాజీ రాష్ట్రపతి, శాస్త్రవేత్త డాక్టర్ అబ్దుల్ కలాం వర్ధంతి సందర్భంగా టీడీపీ నాయకులు ఆయనకు నివాళి అర్పించారు. శనివారం మంగళగిరి పార్టీ కార్యాలయంలో మండలానికి చెందిన నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఆయన సేవలను కొనియాడారు. కుమ్మర శాలివాహన సాధికార సమితి రాష్ట్ర డైరెక్టర్ ఓబుళపతి, సత్యసాయి జిల్లా అధ్యక్షుడు రామాంజనేయులు, టీఎన్‌టీయూసీ అధ్యక్షుడు తాడాల నాగభూషణం, దూదేకుల సాధికార సమితి రాప్తాడు నియోజవకర్గ అధ్యక్షుడు అల్లీపీరా, డీసీ బాబు, సాంబశివ పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడులు

గార్లదిన్నె, జూలై 27: పంటల సాగులో యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని జిల్లా వనరుల కేంద్రం, ఏరువాక కేంద్రం అధికారి మద్దిలేటి అన్నారు. సిరివరంలో వ్యవసాయ శాఖ అధికారి సోమశేఖర్ ఆధ్వర్యంలో వరిసాగు యాజమాన్య పద్ధతులపై రైతులకు శనివారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. మద్దిలేటి, సహాయ సంచాలకులు (ఏడీఏఫ్‌టీసీ) టెక్నికల్ అగ్రికల్చర్ అధికారి శైలజకుమారి మాట్లాడుతూ వరిసాగు చేసే రైతులు ముందుగా పచ్చిరొట్ట ఎరువులైన జీలుగ, ఇనుము, పిల్లిపెసర వేసి దమ్ముచేస్తే వరిపైరుకు ఎరువుల వినియోగం తగ్గుతుందన్నారు. విత్తనశుద్ధి ఖచ్చితంగా నారు వేసే ముందు తెగుళ్ల మందుతో చేసుకోవడం ద్వారా నారు దశలో తెగుళ్లు సోకకుండా నివారించుకోవచ్చునన్నారు. ఎక్కువ వరిపైరు సాగుచేసే రైతులు మూడు పంటలకోసారి భూమిలో జింక్ సల్ఫేట్ ఎకరాకు 20 కేజీలు, లీటర్ నీరులో 2 గ్రాములు పిచికారి చేయాలని సూచించారు. నారుమడిలో ఎక్కువ నీరు పెట్టకుండా తక్కువ నీరు పెట్టాలని తదితర అంశాలను రైతులకు వివరించారు.

ప్రాథమిక చికిత్సలు మాత్రమే అందించాలి

చెన్నేకొత్తపల్లి, జూలై 27: ప్రథమ చికిత్స కేంద్రాల్లో రోగులకు కేవలం ప్రాథమికచికిత్సలు మాత్రమే అందించాలని ప్రభుత్వ వైద్యాధికారి రవినాయక్ ఆదేశించారు. చెన్నేకొత్తపల్లిలోని ప్రాథమిక చికిత్స కేంద్రాలు(ఆర్ఎంపీ)శనివారం ఆయన తనిఖీ చేశారు. ఆస్పత్రిలో ఎలాంటి పడకలు కానీ రోగులకు సెలైన్ బాటిల్స్, ఇంజక్షన్లు అందించరాదన్నారు. తమ పరిధిలో చికిత్సలు అందించిన తరువాత ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి రెఫర్ చేయాలన్నారు. నిబంధనలు అతిక్రిమిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆరోగ్యకార్యకర్తలు వెంకటేశ్, భాస్కర్‌రెడ్డి, గౌసియా పాల్గొన్నారు.

కౌలు రైతులు గుర్తింపు కార్డులు తీసుకోవాలి



కక్కలపల్లిలో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి ఉమామహేశ్వరమ్మ

అనంతపురంరూరల్, జూలై 27: కౌలు రైతులు గుర్తింపు కార్డులు తప్పనిసరిగా తీసుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి ఉమామహేశ్వరమ్మ పేర్కొన్నారు. శనివారం మండలంలోని కక్కలపల్లి ఆర్ఎస్‌ఏలో కౌలు రైతుల అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి జిల్లా వ్యవసాయాధికారిని హాజరై మాట్లాడారు. కౌలుకు సాగు చేస్తున్న ప్రతి రైతు గుర్తింపు కార్డు పొందాలన్నారు. దీని వలన కౌలుకు భూములు ఇచ్చే రైతులకు ఎలాంటి ఇబ్బందులుండవన్నారు. ఏఓ శశికళ, జడ్పీటీసీ చంద్రకుమార్, ఏఈఓ మురళీకృష్ణ, అలేఖ్య, ఉద్యాన సహాయకులు కిషోర్ కుమార్, రైతులు పాల్గొన్నారు.

రాప్తాడు: కౌలు రైతులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేస్తామని జిల్లా వ్యవసాయాధికారి ఉమామహేశ్వరమ్మ అన్నారు. మండలంలోని బోగినేపల్లి గ్రామంలో శనివారం జిల్లా వ్యవసాయాధికారి కౌలు రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ కౌలు రైతులకు బ్యాంకుల ద్వారా రుణాలు అందేలా చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం కౌలు రైతులకు ప్రొద్దుతిరుగుడు విత్తనాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏఓ శేఖర్‌రెడ్డి, సర్పంచ్ ఉజ్జినప్ప, రైతులు నారాయణ, ముత్యాలప్ప, శివ, వ్యవసాయశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా ఏడు శనివారాల వ్రతం


పూజలందుకుంటున్న స్వామి అమ్మవార్లు

అనంతపురం కల్చరల్, జూలై 27: రామ్‌నగర్‌లోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం ఏడుశనివారాల వ్రతాన్ని వైభవంగా నిర్వహించారు. ఆలయంలో స్వామివార్ల మూలవిరాట్‌లను వివిధ రకాల పుష్పాలతో నేత్ర మనోహరంగా అలంకరించి పూజాది కైంకర్యాలు నిర్వహించారు. అనంతరం ఆలయ ఆవరణలోని వేదికపై స్వామివార్ల ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించి వేదపండితులు మంత్రాలు వల్లిస్తుండగా భక్తులు సామూహికంగా ఏడు శనివారాల వ్రతాలను ఆచరించారు. మహామంగళహారతి నివేదనానంతరం భక్తులకు తీర్థప్రసాద వినియోగం, అన్నదానం చేశారు.


ఏడుశనివారాల వ్రతాన్ని ఆచరిస్తున్న భక్తులు

సంబరంగా మొహరం


పాతూరులో పీర్ల ఊరేగింపు సందడి

అనంతపురం కల్చరల్, జూలై 27: మొహరం వేడుకలను పురస్కరించుకుని శనివారం నగరంలోని వివిధ ప్రాంతాల్లో సంబరాలు అంబరాన్నంటాయి. నగర వ్యాప్తంగా మేళతాళాలు, డప్పు వాయిద్యాల మధ్య పీర్లను ఊరేగించి చక్కెర చదివింపులు చేశారు. ప్రధానంగా పాతూరు వీధులు భక్తులతో కిక్కిరిసిపోయాయి. విభిన్న రూపాల్లో పీర్లను అలంకరించి చూపరులను ఆకట్టుకున్నారు. పీర్ల ఊరేగింపు ముందు యువత చిందులు వేస్తూ ఉత్సాహంగా సాగారు. కల్యాణదుర్గం రోడ్డులో సయ్యద్‌బాబా సర్దార్‌వలి పీర్లను ప్రత్యేకంగా అలంకరించి ఊరేగించి, అనంతరం జలధికి తరలించారు. కార్యక్రమంలో మల్లికార్జున, బాషా, రాము, సర్దార్‌వలి, రమణ, సంతోష్, నవీద్, అలి, జాఫర్, వీరన్న, బండి రామంజి, చల్లాకుమార్ పాల్గొన్నారు.

సంప్రదాయాల జ్ఞానాన్ని పెంచేదే జ్ఞానపీఠం

● బ్రహ్మశ్రీ సామవేదం షణ్ముఖశర్మ


షణ్ముఖశర్మకు జ్ఞాన దీపశిఖ బిరుదుతో సత్కరిస్తున్న దృశ్యం

అనంతపురం కల్చరల్, జూలై 27: సనాతన భారతీయ సంస్కృతి, సంప్రదాయాల జ్ఞానాన్ని భావితరాల కోసం చంద్రశేఖరేంద్ర సరస్వతి జ్ఞాన పీఠం పెంచుతోందని బ్రహ్మశ్రీ సామవేదం షణ్ముఖశర్మ అన్నారు. శనివారం అనంతపురం విచ్చేసిన ఆయన 2వ రోడ్డులోని ఆ పీఠాన్ని సందర్శించారు. పీఠం అధ్యక్షుడు మధుసూదనరావు, గోటేటి శ్రీనివాసరావు ఆయనకు స్వాగతం పలికారు. అనంతరం షణ్ముఖశర్మకు జ్ఞాన దీపశిఖ బిరుదు ప్రదానం చేసి సత్కరించారు.

శాకంబరి దేవిగా వాసవీమాత



గార్లదిన్నె, జూలై 27: మండలంలోని కలూరు గ్రామంలో కన్యకా పరమేశ్వరి ఆలయంలో ఆషాడమాసాన్ని పురస్కరించుకుని శనివారం అమ్మవారు శాకంబరీదేవి ఆలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అర్చకులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో ఆలయానికి తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు.

డాక్టర్ నారాయణప్ప సేవలు మరువలేనివి

అనంతపురం క్లాక్‌టవర్, జూలై 27: అనంతపూర్ క్లబ్, టీటీ సంఘం సభ్యులుగా, వైద్యుడిగా డాక్టర్ నారాయణప్ప చేసిన సేవలు మరువలేనివని డీఆర్ఓ రామకృష్ణారెడ్డి అన్నారు. ఇటీవల ఆకస్మికంగా మరణించిన నారాయణప్ప స్మారకార్థం అనంతపూర్ క్లబ్ ఇండోర్ స్టేడియంలో ఏర్పాటు చేసిన టీటీ, షటిల్ బ్యాడ్మింటన్ ఉడెన్ కోర్టును శనివారం డీఆర్ఓ ప్రారంభించారు. క్లబ్ సెక్రటరీ కేశవరెడ్డి, టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు మురళీధర్‌రావు, సూర్యనారాయణ, సభ్యులు రాజశేఖర్‌రెడ్డి, లక్ష్మన్న, అగిశం రంగనాథ్, గల్లా హర్ష, డాక్టర్ జొన్నా సత్యనారాయణ పాల్గొన్నారు.

లా పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలి

అంతపురం సెంట్రల్, జూలై 27: లా కోర్సుల పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని ఎస్కేయూ ఆర్ట్స్ అండ్ సైన్స్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ క్రిష్ణకుమారి అధికారులకు సూచించారు. శనివారం ఆమె పరీక్ష కేంద్రాన్ని సందర్శించారు. న్యాయ విభాగాధిపతి డాక్టర్ శ్రీరాములతోకలిసి పరీక్షల నిర్వహణ తీరుపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు.

ఉచిత గుండె వైద్య శిబిరం

శింగనమల జూలై 27: మండల కేంద్రంలో ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ ఆధ్వర్యంలో ఉచిత గుండె వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. శనివారం జిల్లా పరిషత్ పాఠశాలలో అనంతపురానికి చెందిన విమార్క్ సూపర్ స్పెషాలిటీ వైద్యులు శిబిరం ఏర్పాటు చేశారు. 150 మంది రోగులకు వైద్యసేవలు అందించినట్లు నిర్వాహకులు తెలిపారు. రోగులకు ఈసీజీ పరీక్షలు చేసి మందులు అందజేశారు.

విద్యాశాఖ పోస్టుల భర్తీలో కలెక్టర్ చొరవ చూపాలి

అనంతపురం సెంట్రల్, జూలై 27: విద్యాశాఖలోని పోస్టుల భర్తీ అంశంలో కలెక్టర్ చొరవ తీసుకోవాలని ఎమ్మార్పీఎస్ రాయలసీమ అధ్యక్షుడు అక్కులప్ప కోరారు. శనివారం ఆ సంఘం కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల ప్రభుత్వ ఉద్యోగులకు పదోన్నతులు, బదిలీల అంశాల్లో తీవ్ర అన్యాయం చేశారన్నారు. వైసీపీ ప్రభుత్వాన్ని గద్దెదించడంలో ప్రధాన పాత్రపోషించారన్నారు. కూటమి ప్రభుత్వంలోనూ అదే అన్యాయాన్ని కొసాగించేలా విద్యాశాఖలోని సమగ్ర శిక్ష విభాగం సెక్టోరియల్, అసిస్టెంట్ సెక్టోరియల్, డీఈవో కార్యాలయంలోని ఏఎస్‌ఓ, ఏపీఓ తదితర పోస్టుల నియామకంలో ప్రణాళికలు రూపొందిస్తున్నారని టీచర్లు వాపోతున్నారన్నారు. కలెక్టర్ ఆధ్వర్యంలో పోస్టుల నియామకం చేపడితేనే న్యాయం జరుగుతుందన్నారు.

ఎయిర్‌టెల్ ఫైబర్ గ్రిడ్ హద్దుల పరిశీలన

అనంతపురం న్యూటౌన్, జూలై 27: జిల్లాలో ఎయిర్‌టెల్ ఫైబర్ గ్రిడ్ కేబుల్ ఏర్పాటులో భాగంగా రిజర్వ్ ఫారెస్టులో కేబుల్ ఏర్పాటుకు ఇప్పటికే అటవీశాఖ నుంచి అనుమతులు పొందారు. అందులో భాగంగా నిబంధనలకు అనుగుణంగానే కేబుల్ ఏర్పాటు చేస్తున్నారా లేదా అన్నది శనివారం క్షేత్రస్థాయిలో రేంజర్ శ్రీనివాసులు, సెక్షన్ ఆఫీసర్ ప్రవీణ్‌కుమార్ తనిఖీ చేపట్టారు. డిఫరెన్షియల్ గ్లోబల్ పొజిషనింగ్ సిస్టం (డీజీపీఎస్) పరిశీలించారు.

ఆటో-ద్విచక్రవాహనం ఢీ.. యువకుడి మృతి


రాజ్‌కుమార్ (ఫైల్)

నార్పల, జూలై 27: మండల కేంద్రంలోని గూగూడు రోడ్డు పెట్రోల్ బంక్ వద్ద శనివారం సాయంత్రం ఆటో, ద్విచక్రవాహనం ఢీకొన్న ప్రమాదంలో రాజ్‌కుమార్(30) అనే వ్యక్తి మృతిచెందాడు. పులుసలనూతల గ్రామానికి చెందిన రాజ్‌కుమార్ ద్విచక్రవాహనంలో పెట్రోల్ వేయించుకుందామని గూగూడు రోడ్డులోని పెట్రోల్ బంకు వద్దకు వెళ్లాడు. పెట్రోల్ వేసుకుని స్వగ్రామానికి బయలుదేరడానికి రోడ్డు క్రాస్ చేస్తుండగా గూగూడు నుంచి అతి వేగంగా వచ్చిన ఆటో ద్విచక్రవాహనాన్ని ఢీకొంది. ప్రమాదంలో రాజ్‌కుమార్ తీవ్రంగా గాయపడ్డాడు. గాయపడిన అతనిని 108 వాహనం ద్వారా అనంతపురానికి తరలించారు, అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు. రాజ్‌కుమార్‌కు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. మృతుడి తండ్రి రాజన్న ఫిర్యాదు మేరకు ఎస్ఐ రాజశేఖర్‌రెడ్డి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

తోటలో ఆటపై ఎస్పీ సీరియస్

ఆంధ్రజ్యోతి స్పందన

తాడిపత్రి, జూలై 27: పుట్లూరు మండలంలోని సుబ్బరాయసాగర్ వద్ద ఉన్న ఓ అరటి తోటలో ఓ వైసీపీ నాయకుడు నిర్వహిస్తున్న పేకాటస్థావరంపై శనివారం ఆంధ్రజ్యోతిలో తోటలో ఆట అనే శీర్షికన కథనం ప్రచురితమైంది. ఇందుకు ఎస్పీ మురళీకృష్ణ సీరియస్ అయ్యారని తెలుస్తోంది. ఇప్పటికే ఈ విషయమై పుట్లూరు పోలీసులను ఆరాతీశారని, ఇంత జరుగుతున్నా ఏం చేస్తున్నారని పోలీసు సిబ్బందిపై మండిపడ్డారని, సోమవారం జిల్లా కార్యాలయానికి రావాలని ఆదేశించినట్లు సమాచారం.

మెరుగైన వైద్యసేవలందించాలి

గుంతకల్లుటౌన్, జూలై 27: పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలని ధర్మహ్యూమన్ రైట్స్ ఆర్గనైజేషన్ వారు శనివారం ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ జయవర్ధన్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఆర్గనైజేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వీరాంజనేయులు మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రికి రోజూ వందలాది మంది రోగులు వస్తున్నారని, కాగా సేవలు అందించడంలో సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని అన్నారు. వైద్యులు ప్రైవేట్ క్లినిక్‌లు నడుపుతూ ఇక్కడి రోగులను పట్టించుకోవడం లేదన్నారు. ఇప్పటినుంచైనా మెరుగైన సేవలందించాలని కోరారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో ఆర్గనైజేషన్ సభ్యులు సతీష్‌చౌదరి, కృష్ణమోహన్, జయరాం, శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలి

కూడేరు, జూలై 27 : శ్రీరామిరెడ్డి తాగునీటి పథకం కార్మికులకు వెంటనే పెండింగ్ వేతనాలు చెల్లించాలని, లేకపోతే ఉద్యమం తప్పదని సీఐటీయూ రాష్ట్ర నాయకుడు ఓబులు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. మండలంలోని పీఏబీఆర్ డ్యాంలోని శ్రీరామిరెడ్డి తాగునీటి పథకం కార్మికులతో శనివారం ఆయన సమావేశం నిర్వహించారు. కార్మికులు తమకు నాలుగు నెలల వేతనంతో పాటు 16 నెలల పీఎఫ్ చెల్లించాలని తాగునీటి పథకం ఎదుట నిరసన చేపట్టారు. ఇందుకు ఓబులు మాట్లాడుతూ సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు. పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించకపోతే ఆందోళనలు చేస్తామని తెలిపారు. సమావేశంలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్ర కుమార్ పాల్గొన్నారు.

పీఏబీఆర్‌కు నీటి విడుదల

ఉరవకొండ, జూలై 27: మండలంలోని మోపిడి సమీపంలో హెచ్చెల్సీకి అనుబంధంగా ఉన్న పీఏబీఆర్ లింక్ కెనాల్‌కు అధికారులు నీటిని విడుదల చేశారు. నింబగల్లు హెడ్‌రెగ్యులేటర్‌కు శుక్రవారం నీరు చేరడంతో వాటిని పీఏబీఆర్, ఎంపీఆర్ డ్యాంలకు మళ్లించారు. తాగు నీటి అవసరాల కోసం విడుదల చేసినట్లు అధికారులు తెలిపారు.

ఆధార్ కేంద్రాలను వినియోగించుకోండి

ఉరవకొండ, జూలై 27: ప్రజలు ఆధార్ ప్రత్యేక కేంద్రాలను వినియోగించుకోవాలని ఎంపీడీవో సుబ్బరాజు సూచించారు. పట్టణంలోని రెండో సచివాలయంలో నిర్వహిస్తున్న ఆధార్ కేంద్రాన్ని శనివారం ఆయన పరిశీలించి మాట్లాడారు. ఈ కేంద్రాల ద్వారా ఆధార్ కార్డులో మార్పులు, చేర్పులు, కొత్తకార్డుల జారీ ప్రకియ చేపట్టనున్నట్లు తెలిపారు. ప్రజలు వినియోగించుకోవాలన్నారు. తర్వాత ఎంపీడీవో చాంబర్‌లో పింఛన్ల పంపిణీపై సచివాలయ సిబ్బందితో సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. కార్యక్రమాల్లో ఈవో పీఆర్డీ చంద్రమౌళి, ఏవో జయరాం, పంచాయతీ కార్యదర్శి గౌస్ పాల్గొన్నారు.

ఎలుగుబంటి సంచారం

కూడేరు, జూలై 27 : మండలకేంద్రం సమీపంలో ఎలుగుబంటి సంచరిస్తుండడంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. రైతు బొజ్జి శుక్రవారం రాత్రి తోటలోకి వెళ్లి వస్తుండగా.. గ్రామ సమీపంలో ఎలుగుబంటి కనిపించింది. దీంతో ఆయన భయాందోళనకు గురయ్యాడు. వెంటనే గ్రామంలోకి పరుగెత్తుకొచ్చి గ్రామస్థులకు సమాచారమిచ్చాడు. అన్నదాతలు తోటల్లోకి వెళ్లాలంటే ఆందోళన చెందుతున్నారు.

మస్తానయ్య స్వామి దర్గా సందర్శన

గుంతకల్లుటౌన్, జూలై 27: పట్టణంలోని పాతగుంతకల్లులో వెలసిన హజరత్ సయ్యద్ మస్తాన్‌వలి దర్గాను టీడీపీ ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం సోదరుడు గుమ్మనూరు నారాయణస్వామి శనివారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు చేయించారు. ముజావర్లు ప్రసాదాలను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఉరుసు ఉత్సవాల్లో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

రైల్వే ఆస్పత్రికి అంబులెన్స్ ఏర్పాటు చేయాలని ధర్నా

గుత్తి, జూలై 27: పట్టణంలోని రైల్వే ఆస్పత్రికి అంబులెన్స్ ఏర్పాటు చేయాలని కోరుతూ రైల్వే మజ్దూర్ యూనియన్ నాయకులు శనివారం భోజన విరామ సమయంలో ఆ ఆస్పత్రి వద్ద ధర్నా నిర్వహించారు. తొలుత మజ్దూర్ కార్యాలయం నుంచి ర్యాలీ రైల్వే ఆసుపత్రి వరకు ర్యాలీ చేపట్టారు. అనంతరం అక్కడ ఆందోళనకు దిగారు. పలువురు మాట్లాడుతూ ఆస్పత్రికి గతంలో అంబులెన్స్ ఉండేదన్నారు. ఆ అంబులెన్స్ డ్రైవర్‌ను గుంతకల్లుకు బదిలీ చేశారన్నారు. దీంతో ఇక్కడ అంబులెన్స్ సౌకర్యం లేక స్థానికులు ఇబ్బంది పడుతున్నారన్నారు. ఈ విషయంపై సీఎండీ డాక్టర్ వెంకటేశ్వర రావుకు, డీఆర్ఎం, సీఎంఎస్ అధికారులకు విన్నవించామన్నారు. అయినా ఫలితం లేదన్నారు. ఇప్పటికైనా ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం ఆసుపత్రి వైద్యులకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఏడీఎస్ నారాయణ, డీజిల్ షెడ్ బ్రాంచ్ సెక్రెటరీ రామాంజనేయులరెడ్డి, చైర్మన్ నరసింహ, ఓపెన్‌లైన్ బ్రాంచ్ సెక్రెటరీ మనోహర్‌తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత: కలెక్టర్

రాయదుర్గం రూరల్, జూలై 27: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని, అందుకు ప్రతిఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని కలెక్టర్ వినోద్‌కుమార్ సూచించారు. మండలంలోని జుంజురంపల్లి గ్రామంలోని రైతుసేవా కార్యాలయం వద్ద శనివారం నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. ముఖ్యఅతిథిగా కలెక్టర్ హాజరై మొక్కలు నాటారు. అనంతరం మాట్లాడుతూ ప్రతిఒక్కరూ మొక్కలు నాటడంతో పాటు సంరక్షణ బాధ్యతలను తీసుకోవాలని తెలిపారు. పర్యావరణం దెబ్బతినకుండా ఉండాలంటే చెట్లు ఉండాలని చెప్పారు. అనంతరం రైతుసేవ కేంద్రంలో జరుగుతున్న సేవలను ఏఓ మహేంద్రను అడిగి తెలుసుకున్నారు. రైతులకు నిత్యం అందుబాటులో ఉండాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ వన్నూరుస్వామి, ఏఓ నిర్మల్‌కుమార్, వ్యవసాయ సహాయ అధికారి నాగరాజు, గ్రామస్థులు పాల్గొన్నారు.


రైతు సేవా కేంద్రం వద్ద మొక్కలు నాటుతున్న కలెక్టర్ వినోద్‌కుమార్

మార్కెట్‌యార్డు ఆకస్మిక తనిఖీ

రాయదుర్గంరూరల్: పట్టణంలోని మార్కెట్‌యార్డున కలెక్టర్ వినోద్ కుమార్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అక్కడ చేపడుతున్న కార్యకలాపాలను స్థానిక సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. జిల్లాలో ఏయే మార్కెట్‌యార్డులు చురుగ్గా పని చేస్తున్నాయి, చెక్‌పోస్టులలో మార్కెట్‌ఫీజులు ఏ మేరకు వసూలు చేస్తున్నారు తదితర వివరాలను మార్కెటింగ్ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ సత్యనారాయణచౌదరిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం మార్కెట్‌యార్డు ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో మార్కెట్‌యార్డు సెక్రెటరీ శ్రీనివాసులు, సీఐ శ్రీనివాసులు, తహసీల్దార్ చిట్టిబాబు, మార్కెట్‌యార్డు సిబ్బంది పాల్గొన్నారు.

అబ్దుల్ కలాంకు ఘన నివాళి

గుంతకల్లు టౌన్, జూలై 27: మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం వర్ధంతిని పట్టణంలో టీడీపీ శ్రేణులు శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక 60అడుగుల రోడ్డులో గల కలాం విగ్రహానికి ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం సోదరుడు గుమ్మనూరు నారాయణస్వామి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ అబ్దుల్ కలాం శాస్త్రవేత్తగా, రాష్ట్రపతిగా దేశానికి చేసిని సేవలు ఎనలేనివని కొనియాడారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు బండారు ఆనంద్, నాయకులు గుజిరీ మహ్మద్‌ఖాజా, ఫ్రూట్‌మస్తాన్, పజులు, ఆటోఖాజా తదితరులు పాల్గొన్నారు. అలాగే బీజేపీ నాయకులు కూడా కలామ్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు వడ్డె రమేష్, అసెంబ్లీ కన్వీనర్ బండారుకృష్ణమూర్తి, పట్టణ ప్రధాన కార్యదర్శి సతీష్, మహిళా మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు విజయలక్ష్మి, నాయకులు పాల్గొన్నారు. విద్యార్థిసేన వ్యవస్థాపక అధ్యక్షుడు అబ్దుల్‌బాసిద్, అధ్యక్షుడు మహేష్‌గుప్తా, తదితర నాయకులు కూడా నివాళులర్పించారు.

యాడికి: అబ్దుల్‌కలాం వర్ధంతిని మండలకేంద్రంలోని టీడీపీ నాయకులు, ఉపాధ్యాయులు నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానికంగా ఉన్న ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో టీడీపీ బీసీసెల్ మండల అధ్యక్షుడు తిరంపురం నీలకంఠ, పార్టీ పట్టణ అధ్యక్షుడు ఆదినారాయణ, నాయకులు నారాయణస్వామి, రహంతుల్లా, సుభాన్, రామచంద్ర, విజన్‌హైస్కూల్ కరెస్పాండెంట్ విశ్వనాథ్, యాడికి హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు నాగన్న, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


గుంతకల్లులో కలాం విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న టీడీపీ నాయకులు

వైభవంగా పల్లకీ సేవ

ఉరవకొండ, జూలై 27: మండలంలోని పెన్నహోబిలం లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శనివారం పల్లకీ సేవను వైభవంగా నిర్వహించారు. తొలుత అర్చకులు ఆలయంలోని మూలవిరాట్‌కు ప్రత్యేక అభిషేకాలు, అలంకరణలు, పూజలు నిర్వహించారు. తర్వాత ఉత్సవమూర్తిని పట్టువస్త్రాలతో అలంకరించి పల్లకిలో కొలువుదీర్చారు. మేళతాళాల మధ్య ఆలయం చుట్టూ ఊరేగించారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి తీర్థప్రసాదాలు పొందారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.


స్వామి వారిని పల్లకీలో ఊరేగిస్తున్న భక్తులు

ఘనంగా చిన్న పీర్ల పండుగ

గుత్తి/గుత్తి రూరల్, జూలై 27: గుత్తి ఆర్ఎస్‌లో శనివారం చిన్న పీర్ల పండుగను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం ముజావర్లు పీర్లను మకానం వద్ద ఏర్పాట అగ్నిగుండం ప్రవేశం చేయించారు. అనంతరం మేళతాళాల మధ్య పుర వీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. భక్తులు చక్కెర చదవింపులు చేసి మొక్కులు తీర్చుకున్నారు. సాయంత్రం పీర్లు జలధికి వెళ్లాయి. అలాగే గుత్తి మండలంలోని పూలకుంట గ్రామంలోనూ చిన్న పీర్ల పండుగ వేడుకలు ఘనంగా జరిగాయి.


గుత్తి ఆర్ఎస్‌లో ఊరేగింపుగా వెళ్తున్న పీర్లు

జనసేన క్రియాశీలక సభ్యత్వం నమోదు

గుంతకల్లు టౌన్, జూలై27: పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం వద్ద శనివారం జనసేన క్రియాశీలక సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఆ పార్టీ శ్రేణులు చేపట్టారు. ఈ సందర్భంగా సీనియర్ నాయకుడు పూలరమణ మాట్లాడుతూ సభ్యత్వం తీసుకున్న వారికి ప్రమాద, జీవిత బీమా సౌకర్యం ఉంటుందన్నారు. కార్యక్రమంలో పార్టీ మహిళలు జంగటి లత, తోట స్రవంతి, ఉష, వక్కల ఉమ, మండల అధ్యక్షుడు కురువ పురుషోత్తం, నాయకులు పాల్గొన్నారు.

తాడిపత్రి: పట్టణంలోని గాంధీసర్కిల్, కూరగాయలమార్కెట్, బస్టాండ్, గాంధీకట్ట ప్రాంతాల్లో దాదాపు పదిరోజులుగా జరుగుతున్న జనసేన సభ్యత్వ నమోదు కార్యక్రమం శనివారమూ కొనసాగింది. నియోజకవర్గ ఇన్‌చార్జి కదిరి శ్రీకాంత్‌రెడ్డి కార్యక్రమాన్ని చేపట్టారు. దాదాపు 100మంది సభ్యత్వాన్ని తీసుకున్నారని ఆయన తెలిపారు.

నేమకల్లులో అధికారుల పర్యటన

బొమ్మనహాళ్, జూలై 27 : మండలంలోని నేమకల్లు గ్రామ శివారులో ఉన్న స్పాంజ్ ఐరన్ ఫ్యాక్టరీ ద్వారా వచ్చే కాలుష్యంతో పంట పొలాలు దెబ్బతింటున్నాయని, ఫ్యాక్టరీ యాజమాన్యం అరకొరగా పరిహారం అందించి రైతులను మోసగిస్తున్నారని, రైతులకు న్యాయం చేయాలని కోరుతూ సీపీఐ, రైతు కూలీ సంఘం నాయకులు కొన్ని రోజులుగా పోరాటాలు చేస్తున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో అనంతపురం ఎన్విరాన్‌మెంట్ ఇంజనీర్ కిషోర్‌రెడ్డి, ఎనలిస్ట్ మహేష్ శనివారం ఆయా పంట పొలాలను పరిశీలించారు. పంటలపై పడుతున్న దుమ్మూధూళిని గుర్తించారు. దీంతో రైతులు తమకు న్యాయం చేయాలని అధికారుల ముందు నిరసనకు దిగారు. ఇందుకు రాయదుర్గం రూరల్ సీఐ ప్రసాద్‌బాబు, డీ.హీరేహాళ్ ఎస్ఐ గురుప్రసాద్‌రెడ్డి సర్ది చెప్పారు. అనంతరం ఇంజనీర్ కిషోర్‌రెడ్డి సమస్యను ఉన్నతాధికారులకు తెలుపుతామన్నారు. వారం పదిరోజుల్లో పొల్యూషన్ యంత్రాలను తెచ్చి పరిశీలిస్తామన్నారు. ఫ్యాక్టరీ యజమానులకు మద్దతు తెలిపితే ఎంతకైనా పోరాటాలు చేస్తామని సీపీఐ నాయకుడు నాగార్జున హెచ్చరించారు.


పంటలను పరిశీలిస్తున్న ఎన్విరాన్‌మెంట్ అధికారులు

ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు

రాయదుర్గం రూరల్, జూలై 27: మండలంలోని వడ్రవన్నూరు గ్రామ సమీపంలో వెలసిన అప్పులాపురం ఆంజనేయస్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయాన్నే అర్చకులు స్వామి వారికి పంచామృతాభిషేకం చేసి పట్టువస్త్రాలు, పుష్పాలు, వెండి కవచాలతో అలంకరించారు. అనంతరం కుంకుమార్చనలు, ప్రత్యేక పూజలు చేపట్టారు. భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి స్వామిని దర్శించుకుని పూజల్లో పాల్గొన్నారు.


ప్రత్యేక అలంకరణలో ఆంజనేయస్వామి

కన్యకాపరమేశ్వరికి ప్రత్యేక పూజలు

యాడికి, జూలై 27: మండలకేంద్రం లోని కన్యకాపరమేశ్వరి ఆలయంలో శనివారం ఆషాడమాస పూజలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు ఉదయమే అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు జరిపారు. తర్వాత కుంకుమార్చన, లలితా సహస్రనామావళి చేపట్టి, 101రకాల పిండివంటలు, పండ్లు నైవేద్యంగా సమర్పించారు. ఆర్యవైశ్య సంఘం, ఆర్యవైశ్య మహిళా సంఘం సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.


ప్రత్యేక అలంకరణలో కన్యకాపరమేశ్వరి

విద్యారంగ సమస్యలను పరిష్కరించాలి

గుంతకల్లు టౌన్, జూలై 27: విద్యారంగంలో నెలకొన్న సమస్యలను సత్వరమే పరిష్కరించాలని యూటీఎఫ్ నాయకులు కోరారు. ఈ మేరకు పట్టణంలోని ఎమ్మార్సీలో శనివారం ఎంఈఓలు మస్తాన్‌రావు, సుబ్బరాయుడులకు వినతి పత్రం అందజేశారు. అనంతరం మాట్లాడుతూ జీఓ 117ను రద్దు చేయాలన్నారు. అలాగే జీఓ ఎంఎస్ నెంబర్ 53, అక్టోబరు12, 2020 ప్రకారం టీచర్లను కేటాయించాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఒకే సిలబస్, ఒకే పరీక్షా విధానం అమలు చేయాలన్నారు. మున్సిపల్ ఉన్నత పాఠశాలల్లో పోస్టులను అప్‌గ్రేడ్ చేయాలని, ప్రమోషన్లు, బదిలీలను వెంటనే చేపట్టాలని, ఉపాధ్యాయుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో యూటీఎఫ్ జిల్లా కోశాధికారి రాఘవేంద్ర, పట్టణ అర్బన్ శాఖ అధ్యక్ష, కార్యదర్శులు రామకృష్ణ, రాజకుమార్, మండల శాఖ ప్రధాన కార్యదర్శి కల్పన, నాయకులు శంకరయ్య, మల్లికార్జున, రేవణ్ణ, సిద్దయ్య, సుధాకర్, ఎల్లన్న, తమ్మారెడ్డి పాల్గొన్నారు.

అందుబాటులో వరి విత్తనాలు: ఏఓ

బొమ్మనహాళ్, జూలై 27: మండలంలో ఖరీఫ్ సీజన్‌లో వరినారు సాగు కోసం విత్తనాలు అందుబాటులో ఉన్నాయని వ్యవసాయ అధికారి సాయికుమార్ తెలిపారు. మండలకేంద్రంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. వరిసాగు చేసే రైతులకు బీపీటీ విత్తనాలు మండలంలో అందుబాటులో ఉన్నాయని చెప్పారు. ఉద్దేహాళ్, శ్రీధరఘట్ట, హరేసముద్రం, గోనేహాళ్ రైతు సేవా కేంద్రాలలో బీపీటీ, 5204 రకం విత్తనాలు ఉన్నాయన్నారు. 25 కేజీల ప్యాకెట్ ధర రూ. 700 అని తెలిపారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మంత్రి కేశవ్ చొరవతో తీరనున్న తాగునీటి కష్టాలు

ఉరవకొండ, జూలై 27: పట్టణ ప్రజలకు తాగునీటి కష్టాలు తీరనున్నాయి. హెచ్చెల్సీ ద్వారా కాలువకు నీరు రానున్న నేపథ్యంలో నీటిపంపింగ్ యుద్ధప్రాతిపదికన చేపట్టాలని మంత్రి కేశవ్ ఈ నెల 19వ తేదీన కలెక్టర్‌ను ఆదేశించిన విషయం తెలిసిందే. అదే రోజు అనంతపురం నగరపాలక కమిషనర్, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు స్థానిక సమ్మర్ స్టోరేజ్ ట్యాంకులను పరిశీలించి నీటి పంపింగ్‌కు సిబ్బందిని ఆదేశించారు. అలాగే పంప్ హౌస్‌లో ఉన్న మోటార్లకు మరమ్మతులు చేయించారు. ఆరు నెలలుగా పట్టణ ప్రజలు తాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్నారు. నెల రోజుల నుంచి మంత్రి ఆదేశాలతో స్థానిక టీడీపీ నాయకులు పట్టణంలో ట్యాంకర్లతో నీటిని సరఫరా చేస్తున్నారు. ఇక కాలువకు నీరు రానుండడంతో తాగునీటి సమస్య తీరనున్నదని ప్రజలు పేర్కొంటున్నారు. హెచ్చెల్సీకి శుక్రవారం రాత్రి నీరు రావడంతో శనివారం ఉదయం కాలువ నుంచి నేరుగా ఫిల్టర్ బెడ్లలోకి పంపింగ్ చేపట్టారు. ఫిల్టర్ బెడ్లనుంచి సంపు ద్వారా నీటిని సరఫరా చేసేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. మరో వైపు చెరువులలోకి నీటిని పంపింగ్ చేసేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఒకవైపు చెరువులలోకి, మరో వైపు ఫిల్టర్ బెడ్లలోకి నీటిని పంపింగ్ చేసి నీటిని వదిలేలా చర్యలు తీసుకుంటున్నారు.

రైతు ద్రోహి విశ్వ

కూడేరు, జూలై 27: ఉరవకొండ నియోజకవర్గంలో మెగా డ్రిప్ పనులను అడ్డుకున్న మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి రైతు ద్రోహిగా చరిత్రలో నిలిచిపోతారని టీడీపీ నాయకులు మండిపడ్డారు. మండలంలోని కొర్రకోడు గ్రామంలో శనివారం వారు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 2019కు ముందు టీడీపీ పాలనలో రైతుల కోసం నియోజక వర్గానికి రూ. 850 కోట్ల నిధులతో మెగా బిందు సేద్యం పథకాన్ని తీసుకువచ్చి దాదాపు 70 శాతం పనుల పూర్తి చేసిన ఘనత పయ్యావుల కేశవ్‌కు దక్కుతుందన్నారు. అయితే వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత 30 శాతం పనులు జరగకుండా విశ్వ అడ్డుకున్నారని ఆరోపించారు. వేలాది మంది రైతులకు ఉపయోగపడే డ్రిప్ పథకం పనులను అడ్డుకుని ఇప్పుడేమో మొసలి కన్నీరు కరుస్తున్నారని దుయ్యబట్టారు. పీఏబీఆర్ డ్యాం నుంచి నీటి కేటాయింపు లేదని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. రైతుల సంక్షేమం కోసం పయ్యావుల కేశవ్ నిరంతరం శ్రమించారని తెలిపారు. విశ్వేశ్వరరెడ్డి రైతులకు ఉపయోగపడే పని ఒక్కటి కూడా చేయలేదని మండిపడ్డారు. డ్రిప్ పనులను అడ్డుకున్న విశ్వ నియోజక వర్గ రైతులకు క్షమాపణ చెప్పాకే నియోజకవర్గంలో అడుగుపెట్టాలన్నారు. మరో 30 శాతం పనులు పూర్తయితే రైతులకు మేలు జరుగుతుందని భావించిన ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్‌కు రైతుల నుంచి ఆదరణ పెరగడంతో జీర్ణించుకోలేని విశ్వ అసూయతో పనులను మరోసారి అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారన్నారు. అలా చేస్తే రైతుల ద్రోహిగా చరితలో నిలిచిపోతావని వారు హెచ్చరించారు. సమావేశంలో నాయకులు రామకృష్ణ, రాఘవన్న, రామాంజి, అంజనరెడ్డి, వెంకటేష్, నాగేంద్ర, లక్ష్మీనారాయణ, నంది, ప్రశాంత్, తెలిపారు.

పోలీసు చట్టాలపై అవగాహన అవసరం

యాడికి/ పుట్లూరు, జూలై27: కొత్తగా ప్రవేశపెట్టిన పోలీసు చట్టాలపై ప్రజలకు అవగాహన అవసరమని సీఐ నాగార్జునరెడ్డి తెలిపారు. యాడికి మండలం కమలపాడు గ్రామంలో శనివారం ఆయన కొత్తగా ప్రవేశపెట్టిన పోలీసు చట్టాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పోలీసు చట్టాల్లో గతంలో ఐపీసీ ప్రకారం సెక్షన్లు ఉండేవని తెలిపారు. ప్రస్తుతం బీఎస్ఎస్ (భారత న్యాయ సంహిత)గా మార్చారని తెలిపారు. ఎటువంటి చర్యలకు ఏఏ చట్టాలు ఉపయోగిస్తారో ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది చంద్రశేఖర్, నాగరాజు, మహిళా సంరక్షణ కార్యదర్శి ఇంద్రజ పాల్గొన్నారు. అలాగే పుట్లూరు మండలకేంద్రంలో ఎస్ఐ హేమాద్రి కొత్తచట్టాలపై ప్రజలకు వివరించారు.

రోడ్డు పక్కన ప్రసవం

బొమ్మనహాళ్, జూలై 27: మండల పరిధిలోని దేవగిరి గ్రామానికి చెందిన సుప్రజ.. 108 వాహనంలో రోడ్డు పక్కన ప్రసవించారు. సుప్రజకు శుక్రవారం రాత్రి 11:35 గంటలకు పురిటినొప్పులు వచ్చాయి. కుటుంబ సభ్యులు 108కి ఫోన్ చేయడంతో సిబ్బంది వెంటనే గ్రామానికి వెళ్లారు. ఆమెను ఆస్పత్రికి తరలిస్తుండగా.. నొప్పులు ఎక్కువయ్యాయి. దీంతో అంబులెన్స్‌ను రోడ్డు పక్కన ఆపి.. సిబ్బంది ప్రసవం చేశారు. అదృష్టం బాగుంది. తల్లీబిడ్డ క్షేమంగా ఉన్నారు. గర్భం దాల్చింది మొదలు ప్రసవించేందాకా పర్యవేక్షించేందుకు, ప్రసవానికి ముందే ఆస్పత్రిలో చేర్పించేందుకు అవసరమైన యంత్రాంగం ఉంది. ఎప్పటికప్పుడు రికార్డులు నమోదు చేస్తుంటారు. కానీ ఆఖరి క్షణం దాకా గర్భిణి ఇంటికే పరిమితం కావడం, నొప్పులు వచ్చాక హడావుడిగా ఆస్పత్రి దారి పట్టడం ప్రమాదాలకు దారితీస్తోంది. లోపం ఎక్కడుందో గమనించి.. అధికారులు సరిదిద్దుకోవాల్సిన అవసరం ఉంది.


బిడ్డను చూపుతున్న 108 సిబ్బంది

ఇక నుంచి సచివాలయాల్లోనూ గ్రీవెన్స్: ఎంపీడీఓ

రాయదుర్గంరూరల్, జూలై 27 : ప్రజా సమస్యల పరిష్కార వేదిక (గ్రీవెన్స్) కార్యక్రమాన్ని మండలంలోని అన్ని గ్రామ సచివాలయాల్లో నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ అల్లా బకాష్ శనివారం ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వం ప్రతి సోమవారం జిల్లా కేంద్రం, మండలకేంద్రాల్లో మాత్రమే ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని, ఇప్పటి నుంచి కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రతి గ్రామ పంచాయతీలలోని సచివాలయాల్లోనూ జరుపుతారని చెప్పారు. మండలంలోని 15 గ్రామ సచివాలయాల్లో ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రజలు సమస్యల పరిష్కారానికి వినతిపత్రాలను పంచాయతీ కార్యదర్శులకు ఇవ్వాలని సూచించారు. అదే విధంగా ఎంపీడీఓ కార్యాలయంలో కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు.

మధ్యాహ్న భోజన పథకాన్ని పునఃప్రారంభించాలి

కుందుర్పి, జూలై 27 : ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకాన్ని పునఃప్రారంభించాలని ఏఐఎస్ఎఫ్ మండల అధ్యక్షుడు పవన్‌కుమార్ కోరారు. ఈ మేరకు మండలకేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట జూనియర్ కళాశాల విద్యార్థులతో కలిసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో కొనసాగుతున్న మధ్యాహ్న భోజన పథకాన్ని వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రద్దు చేసిందన్నారు. కూటమి ప్రభుత్వం మళ్లీ ప్రారంభించాలని కోరారు. అనంతరం తహసీల్దార్ హనుమంతుకు వినతిపత్రాన్ని అందజేశారు. ఏఐఎస్ఎఫ్ నాయకులు గోవింద, కార్తీక్, జూనియర్ కళాశాల విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

కుట్టు శిక్షణ కేంద్రం ప్రారంభం

గుంతకల్లుటౌన్,జూలై27: పట్టణంలోని సత్యనారాయణ పేటలో మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో, జన శిక్షణ సంస్థ సహకారంతో కేంద్ర ప్రభుత్వం మహిళలకు ఉచిత కుట్టు శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేసింది. దీనిని ఆర్డీఓ శ్రీనివాసుల రెడ్డి శనివారం ప్రారంభించి మాట్లాడారు. ఇందులో 15నుంచి 45 ఏళ్ల మహిళలకు కుట్టుపై వంద రోజులు పాటు ఉచితంగా శిక్షణ ఇస్తారన్నారు. సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సీడీపీఓ ఢిల్లీశ్వరి, జనశిక్షణ సంస్థ టీఓ రషీద్, సూపర్‌వైజర్లు తదితరులు పాల్గొన్నారు.

అన్న క్యాంటీన్ పనుల ప్రారంభం

కళ్యాణదుర్గం, జూలై 27 : పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రి ఎదుట ఉన్న అన్న క్యాంటీన్ భవనానికి శనివారం మరమ్మతు పనులు ప్రారంభించారు. ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు అల్లుడు ధర్మతేజ ముఖ్య అతిథిగా హాజరై స్థానిక టీడీపీ నాయకులు, మహిళలతో కలిసి పూజ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ. 5 కే భోజనం అందించి పేదల ఆకలి తీరుస్తామన్నారు. ఇందుకు ఆగస్టు 10 నాటికి అన్న క్యాంటీన్ భవనాన్ని సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. వైసీపీ ప్రభుత్వంలో మూతపడిన వీటిని కూటమి ప్రభుత్వం పునఃప్రారంభిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.


కళ్యాణదుర్గంలో అన్న క్యాంటీన్ భవనానికి పెయింట్ వేస్తున్న ధర్మతేజ

అన్న క్యాంటీన్ పనుల పరిశీలన

గుత్తి: పట్టణంలోని ఆర్అండ్‌బీ అతిథి గృహం ఆవరణంలో చేపడుతునన అన్న క్యాంటీన్ నిర్మాణ పనులను మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులు పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ త్వరితగతిన పనులు పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఆగస్టు 15న అన్న క్యాంటీన్‌ను ప్రారంభిస్తామన్నారు. ఏఈ హరికిరణ్, ఆర్ఐ రామాంజనేయులు, జూనియర్ అసిస్టెంట్ సుధాకర్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

చెరువు పరిశీలన

పుట్లూరు, జూలై 27: చేపల పెంపకం కోసం మండలకేంద్రంలోని చెరువును ఎంపీడీఓ దస్తగిరి, చేపల పెంపకం అధికారి వైష్ణవి శనివారం పరిశీలించారు. కార్యక్రమంలో మైనర్ ఇరిగేషన్ ఏఈ ఫణీంద్ర, టెక్నికల్ అసిస్టెంట్ రామాంజులరెడ్డి పాల్గొన్నారు.

సెల్‌ఫోన్ వల్ల అనర్థాలు అనేకం

తాడిపత్రి, జూలై 27: అతిగా సెల్‌ఫోన్ వాడకం వల్ల పిల్లలకు ఎన్నో అనర్థాలు కలుగుతాయని అనంతపురానికి చెందిన ప్రముఖ చిన్నపిల్లల వైద్యుడు, ఆబ్బా టీవీ అధినేత హరిప్రసాద్ సూచించారు. పట్టణంలోని కడపరోడ్డులో ఉన్న చర్చిస్కూల్లో శనివారం రోటరీక్లబ్ ఆధ్వర్యంలో మొబైల్ మైకం.. పిల్లల్లో ప్రమాదమా అన్న సదస్సు జరిగింది. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హరిప్రసాద్ హాజరై మాట్లాడారు. ప్రస్తుతం చిన్నారులు ఎక్కువగా సెల్‌ఫోన్‌కు బానిసలుగా మారుతున్నారన్నారు. దీనివల్ల తీవ్ర దుష్పరిణామాలు కలుగుతాయన్నారు. ఏకాగ్రత లోపించడం, చదువుపై అనాసక్తి కలగడం, కంటిచూపు మందగించడం తదితర నష్టాలు కలుగుతాయన్నారు. ఈ నష్టాలను నాటిక రూపంలో ప్రదర్శించి పిల్లలకు చక్కగా వివరించారు. కార్యక్రమంలో రోటరీక్లబ్ అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం, సెక్రెటరీ రఫీ, సభ్యులు పాల్గొన్నారు.

పలువురికి రిమాండ్

పెద్దవడుగూరు, జూలై 27: మండలంలోని లక్షంపల్లి గ్రామానికి చెందిన పలువురిని శనివారం రిమాండ్‌కు పంపినట్లు ఎస్ఐ రెడ్డప్ప తెలిపారు. ఈనెల 25వ తేదీన ఇరువర్గాలకు చెందిన కొందరు కర్రలతో దాడులు, ప్రతిదాడులు చేసుకొని ప్రజల జీవనానికి భంగం కలిగించారని, దీంతో ఇరువర్గాల వారిని అరెస్ట్‌చేశామని చెప్పారు. వీరిని శనివారం అనంతపురం కోర్టులో హాజరుపరచగా 15రోజులు రిమాండ్ విధించినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

కేసు నమోదు

తాడిపత్రి, జూలై 27: పట్టణంలోని సీవీరామన్ విద్యాసంస్థల చైర్మన్ భాస్కర్‌రెడ్డిపై శనివారం కేసు నమోదుచేసినట్లు సీఐ నాగేంద్రప్రసాద్ తెలిపారు. స్థానిక గొల్లపాలెంలో ఉన్న సీవీరామన్ కళాశాల భవనం భద్రతపై గతంలో మున్సిపల్ అధికారులు నోటీసులు జారీచేశారు. దీనిపై కోర్టులో కేసు నడుస్తోంది. కానీ శనివారం కళాశాల భవనానికి మరమ్మతు పనులు చేస్తున్నారన్న సమాచారంతో మున్సిపల్ సిబ్బంది వెళ్లారు. దీంతో చైర్మన్ భాస్కర్‌రెడ్డి సిబ్బందిపై దుర్భాషలాడుతూ మండిపడ్డారు. ఇందుకు మున్సిపల్ కమిషనర్ రామ్మోహన్ పోలీసులకు ఫిర్యాదుచేశారు. ఈమేరకు భాస్కర్‌రెడ్డిపై కేసు నమోదుచేసినట్లు సీఐ తెలిపారు.

కౌన్సిల్ సమావేశం

గుంతకల్లుటౌన్, జూలై27: పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో శనివారం మున్సిపల్ చైర్‌పర్సన్ ఎన్ భవాని అధ్యక్షతన సాధారణ కౌన్సిల్ సమావేశం జరిగింది. ఇందులో పలువురు కౌన్సిలర్లు మున్సిపల్ కొళాయిలకు కలుషిత నీరు సరఫరా అవుతోందని, ఆ నీరు తాగి ప్రజలు రోగాల బారిన పడుతున్నారని తెలిపారు. సమస్యను పరిష్కరించాలని కోరారు. వైసీపీ కౌన్సిలర్ మాణిక్యం మాట్లాడుతూ తమ వార్డులో పారిశుధ్య కార్మికులను కులం పేరుతో శానిటరీ ఇన్స్‌పెక్టర్ వేధిస్తున్నారని ఫిర్యాదు చేశారు. ఇక పలు కౌన్సిలర్లు తమ వార్డుల్లోని పలు సమస్యల్ని అధికారుల దృష్టికి తెచ్చారు. కమిషనర్ వెంకటరమణయ్య, అధికారులు, కౌన్సిలర్లు, కోఆప్షన్‌సభ్యులు పాల్గొన్నారు.

గృహ హింస కేసు నమోదు

బెళుగుప్ప, జూలై 27: మండలంలోని కాలువపల్లి తండాకు చెందిన మల్లేష్‌పై శనివారం గృహ హింస కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శివ తెలిపారు. అతను భార్యను తరచూ కొట్టి వేధింపులకు గురిచేస్తున్నట్లు తెలిసిందని, బాధితురాలు ఈశ్వరమ్మ కూడా ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

డీఎస్సీ కోచింగ్ సెంటర్ పరిశీలన

కళ్యాణదుర్గం, జూలై 27: పట్టణంలో ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మెగా డీఎస్సీ ఉచిత కోచింగ్ సెంటర్‌ను ట్రాన్స్‌కో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఆర్ శేషాద్రి శనివారం పరిశీలించారు. అక్కడ కోచింగ్ తీసుకుంటున్న అభ్యర్థులతో కాసేపు మాట్లాడారు. ఎమ్మెల్యే సురేంద్రబాబు ఈ కోచింగ్ సెంటర్ ఏర్పాటు చేయడం అభినందనీయమని కొనియాడారు. అభ్యర్థులు సద్వినియోగం చేసుకుని ఉద్యోగాలు సాధించాలని ఆకాంక్షించారు.

పట్టపగలే చోరీ

రాయదుర్గం రూరల్, జూలై 27 : మండలంలోని ఆవులదట్ల గ్రామంలో శనివారం మధ్యాహ్నం పట్టపగలే చోరీ జరిగినట్లు ఇంటి యజమాని శ్రీనివాస్‌నాయక్ తెలిపారు. గ్రామంలో మధ్యాహ్నం ఎవరూ లేని సమయంలో వలసకూలీగా వచ్చిన కలకత్తా ప్రాంతానికి చెందిన వ్యక్తి తమ ఇంట్లోని చొరబడి బీరువా పగులగొట్టి రూ. 10 వేలు దొంగలించుకుని పారిపోతుండగా గ్రామస్థులు పట్టుకుని పోలీసులకు అప్పగించారని చెప్పాడు. సీఐ శ్రీనివాసులు సంఘటన స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.